ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కడప
జిల్లా వార్తలు
5
శుక్రవారం 25 జూలై 2025

అన్ని మండలాల్లో సెంట్రలైజ్డ్ కిచెన్లు



సెంట్రలైజ్డ్ కిచెన్ పనుల గురించి తెలుసుకుంటున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

సీకేదిన్నె, జూలై 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని మండలాల్లో సెంట్రల్‌లైజ్డ్ ఆటోమేషన్ కిచెన్లను ఏర్పాటు చేస్తామని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలంలోని చింతకొమ్మదిన్నె జె.కొత్తపల్లె జడ్పీ హైస్కూళ్లలో సెంట్రలైజ్డ్ ఆటోమేషన్ కిచెన్ ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టు కింద ఈ రకమైన మోడల్ కిచెన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. చింతకొమ్మదిన్నె, జె.కొత్తపల్లె కిచెన్ల భవన నిర్మాణ పనులను పరిశీలించి ప్రస్తుతం అమలులో ఉన్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న బోజనం నిర్వహణ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంజనీరింగ్ అధికారులకు మోడల్ కిచెన్ నిర్మాణ పనులపై సూచనలు, సలహాలు చేశారు. జిల్లాలో నిర్మిస్తున్న స్మార్ట్ కిచెన్ హాళ్లు రాష్ట్రానికే ఆదర్శంగా ఉండాలన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలో మున్సిపల్ హైస్కూలులో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ మోడల్ కిచెన్ ద్వారా నగర పరిధిలోని పాఠశాలలకు సరైన సమయంలో భోజనం సరఫరా జరుగుతోందని, జిల్లాలోని అన్ని పాఠశాలలకు ఇదే విధంగా అందించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, ఆగ్రోస్ డీఎం సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ అధికారి విజయకుమార్, హౌసింగ్ పీడీ రాజారత్నం, సీకేదిన్నె తహశీల్దారు నాగేశ్వరరావు, డీఈవో షంషుద్దీన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


పన్ను విధింపు అక్రమాలపై థర్డ్‌పార్టీ తనిఖీలు

ప్రొద్దుటూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్నుల విధింపుల్లో అక్రమాలపై థర్డ్ పార్టీ తనిఖీలు రెండోరోజు గురువారం కూడా కొనసాగుతున్నాయి. పట్టణంలోని పలు ప్రాంతాల్లో దాదాపు 68 అండర్ అసెస్‌మెంట్లను క్షేత్రస్థాయిలో కట్టడాల కొలతలు తీశారు. ఆ మేరకు వాటన్నింటిని ఆన్‌లైన్ చేసి గతంలో ఉన్న కొలతలకు తనిఖీల్లో బయటపడ్డ కొలతలకు తేడా ఉందాలేదా? పరిశీలించి రిమార్కులు నమోదు చేస్తామని థర్డ్ పార్టీ బృందం అధికారి రెవెన్యూ ఆఫీసర్ మునికుమార్ తెలిపారు. మరో రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో పట్టణంలో అండర్ అసెస్‌మెంట్లు ఉన్నవి, అడిషనల్ ఆల్ట్రేషన్‌లను తనిఖీ చేసి నివేదికను పైఅధికారులకు పంపుతామన్నారు. ఈ తనిఖీల్లో ఇప్పటి వరకు పెద్దగా తేడాలు కనిపించలేదని ప్రాథమిక నివేదిక మేరకు వెల్లడించారు.

గండికోట నుంచి సీబీఆర్‌కు నీరు విడుదల

కొండాపురం, జూలై 24(ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి సీబీఆర్‌కు 420 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. మెయిన్ కెనాల్‌కు 150 క్యూసెక్కులు, క్రస్టల్ గేట్ల ద్వారా మైలవరం జలాశయానికి 100 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా 20 క్యూసెక్కుల నీటిని వదులుతున్నామన్నారు. ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 14.04 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ తెలిపారు. కాగా గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 26.85 టీఎంసీలు.

1న జమ్మలమడుగుకు సీఎం రాక?




జమ్మలమడుగు, జూలై 24(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగుకు ఆగస్టు 1వ తేదీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రానున్నారు. అందులో భాగంగా గురువారం జిల్లా అధికారుల ద్వారా జమ్మలమడుగు రెవెన్యూ అధికారులకు సమాచారం వచ్చినట్లు తెలిసింది. దీంతో ఆర్డీవో సాయిశ్రీ గురువారం సాయంత్రం జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్‌లో పోలీసు అధికారులతో మాట్లాడారు. ఈ మేరకు జమ్మలమడుగు పట్టణంలోని మూడు ప్రాంతాల్లో హెలిప్యాడ్ కోసం స్థలాలను గుర్తించేందుకు వెళ్లినట్లు పోలీసులు తెలిపారు.

71 మందికి నోటీసులు

చాపాడు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): చాపాడు మండలంలోని 15 గ్రామ సచివాలయాల్లో ఉద్యోగాలు చేస్తున్న 71 మందికి నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీవో వీరకిశోర్ పేర్కొన్నారు. వారు విధులకు ఆలస్యంగా రావడంతో పాటు సాయంత్రం బయోమెట్రిక్ వేయకుండా వెళ్లిపోతున్నారన్నారు. అందువలన వారిని వివరణ కోరుతూ నోటీసులు జారీ చేశామన్నారు. ఇటీవల ప్రభుత్వం ఉద్యోగులకు బదిలీలు చేయడంతో కొత్తగా వచ్చినవారు సమయపాలన పాటించడం లేదని చెప్పారు. ఈ నేపథ్యంలో నోటీసులు అందుకున్న గ్రామ సచివాలయ ఉద్యోగులు గురువారం సాయంత్రం ఎంపీడీవో కార్యాలయానికి చేరుకుని వివరణ ఇచ్చారు.

శ్రావణంలో గృహ ప్రవేశాలు

- 10,821 ఇళ్లు పూర్తి చేయాలని టార్గెట్
- లక్ష్యం చేరుకునేందుకు అధికారుల యత్నం
- ఇప్పటికే 6,648 ఇళ్లు పూర్తి



చలమారెడ్డిపల్లె లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు

(కడప-ఆంధ్రజ్యోతి): పేదల పక్కా ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిచేయాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించింది. జగన్ హయాంలో మంజూరైన ఇళ్లను పూర్తి చేసేందుకు ఎస్సీ ఎస్టీ బీసీలకు అదనపు సాయాన్ని అందిస్తోంది. దీంతో జిల్లాలో గృహ నిర్మాణాలు వేగం పుంజుకున్నాయి. శ్రావణమాసంలో రాష్ట్రవ్యాప్తంగా గృహప్రవేశాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా మన జిల్లాకు 10,821 ఇళ్ల నిర్మాణాన్ని టార్గెట్‌గా ఇచ్చింది. ఇప్పటివరకు 6,648 ఇళ్లను పూర్తిచేసింది. శుక్రవారం నుంచి శ్రావణమాసం ప్రారంభం కానుంది. దీంతో ఆ టార్గెట్ పూర్తి చేసేందుకు లబ్ధిదారుల్లో అధికారులు అవగాహన కల్పించి నిర్మాణాలు పూర్తిచేస్తున్నారు. జిల్లాలో 89,884 పక్కాగృహాల నిర్మాణం చేపడితే, ఇప్పటివరకు 41,895 ఇళ్లు పూర్తయ్యాయి. అంటే మంజూరైన వాటిలో ఇంకా సగం నిర్మాణాలు కూడా పూర్తి కాలేదు.

లేఅవుట్లలో వసతులు కరువు

అప్పటి ప్రభుత్వం హడావుడిగా లేఅవుట్‌లు వేసింది. కనీస వసతులు అయిన రోడ్లు, విద్యుత్, నీటి సౌకర్యం కల్పించలేదు. దీంతో ఇళ్లు కట్టుకునేందుకు లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారు. నిర్మాణానికి అవసరమైన నీళ్లు లేకపోవడంతో.. ట్యాంకర్ల ద్వారా తీసుకువచ్చి ఇల్లు కట్టుకోవాలంటే భారం ఎక్కువ కావడంతో ఉత్సాహం చూపలేదు. లేఅవుట్‌లలో మౌలిక వసతులు లేకపోవడంతో నిర్మాణాలకు అడ్డంకిగా మారింది.

నిర్మాణాలు వేగవంతం

జిల్లాలో జగన్ హయాంలో 89,884 ఇళ్లు మంజూరు చేశారు. అయితే కేంద్రం ఇచ్చే డబ్బులు తప్ప జగన్ ప్రభుత్వంలో అదనంగా డబ్బులు ఇవ్వలేదు. యూనిట్ కాస్ట్ కూడా రూ.1.80లక్షలు మాత్రమే కావడంతో ఇంటి నిర్మాణానికి ఇది ఏమాత్రం సరిపోలేదు. దీంతో లబ్ధిదారులు ఆసక్తి చూపలేదు. పీఎంఏవై కింద చేపట్టిన ఈ స్కీం వచ్చే ఏడాది మార్చి చివరి నాటికి ముగియనుంది. లబ్ధిదారులు అప్పటిలోపు ఇళ్లు కట్టుకుంటేనే బిల్లులు వస్తాయి. లేదంటే రావు. దీనిపై అధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నారు. లేఅవుట్‌లలో కేటాయించిన ఇళ్ల నిర్మాణం నత్తనడకన ఉన్నప్పటికీ సొంత స్థలాలు ఉన్న లబ్ధిదారులు ఇళ్లు కట్టుకుంటున్నారు. దీనికి తోడు ఎస్సీ ఎస్టీ బీసీలకు అదనపు సాయం ఇచ్చి నిర్మాణాలను పూర్తిచేయాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగానే ఎస్సీ, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేల చొప్పున సాయం అదనంగా ఇస్తోంది. దీంతో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలంటూ లబ్ధిదారులపై అధికారులు ఒత్తిడి తెస్తున్నారు.

ఇళ్ల నిర్మాణం వెంటనే పూర్తిచేయండి..



పక్కా ఇల్లు మంజూరైన ప్రతి లబ్ధిదారుడు నిర్మించుకోవాలి. ఈ స్కీం వచ్చే ఏడాది మార్చికి క్లోజ్ అవుతుంది కనుక లబ్ధిదారులంతా ఆ లోపు ఇళ్లు నిర్మించుకోవాలి. ప్రభుత్వం అదనపు సాయం ఇవ్వడంతో ఇళ్ల నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయి. రోజూ దాదాపు 50 గృహాలే పూర్తవుతున్నాయి. శ్రావణమాసంలో గృహప్రవేశాలు ఉండడంతో ప్రభుత్వం ప్రత్యేకంగా 10,821 ఇళ్ల టార్గెట్ ఇచ్చింది. దానిని పూర్తి చేస్తున్నాం.

- వి.రాజారత్నం, పీడీ, హౌసింగ్

జిల్లాలో ఇళ్ల నిర్మాణాల స్థితి..

నియోజకవర్గం	మంజూరు	బీబీఎల్	బీఎల్	ఎల్ఎల్	ఆర్ఎల్	ఆర్‌సీ	పూర్తి
బద్వేలు	10,529	273	2,078	76	1188	1,528	5,386
మైదుకూరు	7,829	157	1,158	68	597	985	4,864
ప్రొద్దుటూరు	18,464	1,151	9,072	136	2,213	2496	3,396
జమ్మలమడుగు	8,784	320	2,263	62	805	201	5,133
పులివెందుల	16,488	688	2,726	205	2,785	2,960	7,124
కమలాపురం	4,783	214	680	46	540	273	3,030
కడప	21,170	511	11,406	204	1,516	889	6,644
రాజంపేట (సిద్దవటం, ఒంటిమిట్ట)	1,837	53	354	26	196	44	1,164

సున్నపురాళ్లపల్లెలో సోలార్ ప్రాజెక్టు

- గండికోటలో రూ.2.90 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ భవనాలు
- కేబినెట్‌లో ఆమోదం



(కడప-ఆంధ్రజ్యోతి): జిల్లాను అటు హార్టికల్చర్ హబ్‌గా, ఇటు పరిశ్రమలకు అడ్డాగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. స్టేట్‌లో, సెంట్రల్‌లో కూటమి ప్రభుత్వం ఉండడంతో పరిశ్రమలకు చకచకా అడుగులు పడుతున్నాయి. వైజాగ్, చెన్నై కారిడార్‌లో భాగంగా కొప్పర్తిలో మౌలిక వసతులు కల్పించనున్నారు. ఇప్పటికే టెండర్లు పూర్తయ్యాయి. ఇక జగన్ హయాంలో పడకేసిన స్టీలు ప్లాంటు మరలా పురుడు పోసుకుంటోంది. గురువారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకుని ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది.

కొప్పర్తిలో ఎలక్ట్రానిక్ విడిభాగాలు ఇతర పరిశ్రమలు ఏర్పాటు చేసేవారికి పలు రాయితీలు ఇవ్వాలని నిర్ణయించింది. ఎలక్ట్రానిక్ విడిభాగాలు, ఇతర వాటికి సబ్సిడీలు ఇవ్వనున్నారు. దీంతో కొప్పర్తి పారిశ్రామికవాడలో మరిన్ని పరిశ్రమలు వచ్చేందుకు మార్గం ఏర్పడింది. ఇప్పటికే కొప్పర్తిలో పలు ఎలక్ట్రానిక్ పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చాయి. రాయితీ ఇవ్వాలని నిర్ణయించడంతో మరికొన్ని పరిశ్రమలు వచ్చే అవకాశం ఉంది. దీంతో యువతకు దండిగా ఉపాధి దొరకనుంది. ఇక జమ్మలమడుగు నియోజకవర్గంలోని సున్నపురాళ్లపల్లెలో జేఎస్‌డబ్ల్యూ 1050 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు చేయనుంది. దీనికోసం మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇక గండికోట లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించి రూ.2.90 కోట్లతో భవనాలను నిర్మించడానికి ఆమోదం తెలిపింది. మైదుకూరులో నేషనల్ అగ్రికల్చర్ కోఆపరేటివ్ ఆఫ్ ఇండియాకు అవసరమైన ఐదెకరాల స్థలాన్ని కేటాయించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

పీ-4పై దృష్టి సారించండి : కలెక్టర్

కడప కలెక్టరేట్, జూలై 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వం, దాతల భాగస్వామ్యంతో కూడిన పి-4 పథకానికి సంబంధించి బంగారు కుటుంబాల మ్యాపింగ్‌ను అధికారులు ప్రత్యేక శ్రద్ధతో అమలు చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర రాజధాని అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో పలు అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలు నుంచి జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చీఫ్ సెక్రటరీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న జీరో పావర్టీ, పి-4 పాలసీ, గ్రామసభలు, జనాభా నిర్వహణ వంటి అంశాలపై కలెక్టర్లు చొరవ తీసుకోవాలన్నారు. విద్యుత్, ఇసుక, హౌసింగ్ వంటి ప్రభుత్వ పథకాలు సేవలపై ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి సేకరిస్తున్న ప్రజా స్పందనపై పాజిటివ్ పర్‌సెప్షన్ పెంచాలని కలెక్టర్లకు సూచించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, సేవలు పారదర్శకంగా ప్రజలకు అందాలన్నారు. ప్రజల నుంచి సానుకూలత పెరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు సంతృప్తిస్థాయిలో అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, సీపీవో హజరత్తయ్య, కేఎంసీ కమిషనర్ మనోజ్ రెడ్డి, జడ్పీ డిప్యూటీ సీఈవో సుబ్రమణ్యం, గనుల శాఖ డీడీ వెంకట సాయి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కడప డీసీటీవో వేణునాథంకు చుక్కెదురు


- తప్పుడు కులం సర్టిఫికెట్‌తో ఉద్యోగం పొందారని నిర్ధారణ
- దీంతో ఉద్యోగం కోల్పోయిన వేణునాథం

కలికిరి, జూలై 24(ఆంధ్రజ్యోతి): తప్పుడు కులం సర్టిఫికెట్‌తో ఉద్యోగం పొందాడనే అభియోగంతో కడప డిప్యూటీ కమర్షియల్ ట్యాక్స్ అధికారి (డీసీటీవో)గా పనిచేస్తూ ఉద్యోగం నుంచి తొలగించబడిన టి.వేణునాథంకు చుక్కెదురయింది. ఆయన తప్పుడు కులం సర్టిఫికెట్‌తో ఉద్యోగం, తరువాత పదోన్నతి పొందాడని నిర్ధారిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

కడప పట్టణం, రాజారెడ్డి వీధిలో నివసిస్తున్న టి.వేణునాథం ఉమ్మడి రాష్ట్రంలో ఖమ్మం జిల్లాలోని భద్రాచలం మండలం గౌరీపేట స్వస్థలంగా పేర్కొంటూ గౌడు కులం (ఎస్టీ)గా సర్టిఫికెట్ పొందాడు. అంతేగాకుండా తన జన్మస్థానానికి సంబంధించి ఎలాంటి ధ్రువీకరణ ఇవ్వలేదు. దీని పైన ఫిర్యాదులు అందడంతో అప్పటి భద్రాచలం సబ్ కలెక్టరు, ఖమ్మం కలెక్టరు సుదీర్ఘ విచారణలు జరిపించారు. వేణునాథం వాదనలను కూడా పరిశీలించారు. ఈ నేపథ్యంలో ఆయన కులం సర్టిఫికెట్‌ను ఖమ్మం కలెక్టరు రద్దు పరిచారు. అనంతరం ఆయనను ఉద్యోగం నుంచి 2021లో తొలగించారు. దీనిపైన వేణునాథం ఏపీ రాష్ట్ర ప్రభుత్వానికి చేసుకున్న అప్పీలుపై పలు దఫాలుగా విచారణ జరపడంతో పాటు వేణునాథం వాదనలను పరిశీలించిన ఏపీ ప్రభుత్వం చివరికి ఖమ్మం కలెక్టరు నిర్ణయంతో ఏకీభవించింది. దీంతో ఆయన ఎస్టీ కులం సర్టిఫికెట్టును రద్దు పరచడం, ఉద్యోగం నుంచి తొలగించడం కూడా న్యాయబద్ధమేనని పేర్కొంటూ ఏపీ ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎం.ఎం.నాయక్ గురువారం ఆదేశాలు జారీ చేశారు.

వైభవంగా గ్రామోత్సవం





చౌడేశ్వరీదేవి భక్తులు కలశం బిందెలతో చేపట్టిన గ్రామోత్సవం

జమ్మలమడుగు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో గురువారం చౌడేశ్వరీదేవి జయంతిని పురస్కరించుకుని గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. నాగులకట్టవీధి చౌడేశ్వరీదేవాలయంలో ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 9 గంటలకు చౌడేశ్వరీ దేవాలయం వద్ద నుంచి మహిళా భక్తులు కలశం బిందెలతో బయలుదేరి సంజాముల మోటు, పలగాడివీధి, అంబాభవానీ దేవాలయం వీధి, మెయిన్‌బజార్, కూరగాయల మార్కెట్ వీధి, పాత బస్టాండు మీదుగా తిరిగి ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి సమర్పించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు. సాయంత్రం సామూహిక కుంకుమార్చన, లక్ష దీపాలంకరణ తదితర కార్యక్రమాలు జరిగాయి. అనంతరం ప్రసాద వినిమయం చేశారు. ఈ కార్యక్రమంలో చౌడేశ్వరీ దేవస్థానం కమిటీ నాయకులు గంజికుంట తిరుమలదాసు, తిమ్మని వెంకటసుబ్బయ్య, గంజికుంట చంద్ర గోవిందు, బడిగించల విజయలక్ష్మి, చంద్రమౌళి, కాటా రామదాసు, తదితర భక్తులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని మోరగుడి గ్రామంలో చౌడేశ్వరీ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కన్నెలూరు గ్రామంలో చౌడేశ్వరీదేవి దేవాలయం వద్ద నుంచి మహిళలు కలశం బిందెలతో మెరవణి చేశారు.

జీసీడీవోగా రూతు ఆరోగ్యమేరీ



కడప ఎడ్యుకేషన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జీసీడీవోగా రూతు ఆరోగ్యమేరీ బాధ్యతలు స్వీకరించారు. చాలా కాలంగా ఈ పోస్టు ఖాళీగా ఉంది. ఈ నేపథ్యంలో గురువారం కడప నగరం సమగ్ర శిక్ష కార్యాలయంలో గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంటు ఆఫీసర్‌గా ఆమె బాధ్యతలు చేపట్టారు. కడప మున్సిపల్ మెయిన్ స్కూల్‌గా స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఈమెను జీసీడీవోగా డిప్యుటేషన్‌పై నియమించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లాలోని కస్తూర్బా పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు కేజీబీవీల అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తానని తెలిపారు.


ఇన్‌చార్జి డీసీవోగా శ్రీలక్ష్మి

జిల్లా సహకార శాఖ అధికారి (డీసీవో)గా శ్రీలక్ష్మికి బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం డీసీవోగా ఉన్న వెంకటసుబ్బయ్య వ్యక్తిగత కారణాల వల్ల ఈ నెల 24 నుంచి వచ్చే నెల 11వ తేది వరకు సెలవుపై వెళ్లారు. ఆయన స్థానంలో ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మిని ఇన్‌చార్జిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కొండలను కొల్లగొట్టారు

- వైసీపీ ధన దాహానికి బలి
- అనుమతులు లేకుండానే మట్టి తరలింపు


జగన్ హయాంలో కాలేటివాగు నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని యథేచ్ఛగా తరలించుకుపోయారు. వైసీపీ నేతల ధనదాహానికి పచ్చదనంతో ఉండే కొండలు కరిగిపోయాయి. ఒకటి రెండు కాదు.. ఏకంగా 11 కొండలను తవ్వేసి మట్టిని అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.





కడప, జూలై 24(ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గంలోని చక్రాయపేట మండలంలో 1.50 టీఎంసీల సామర్థ్యంతో కాలేటివాగు డ్యామ్ నిర్మాణాన్ని వైసీపీ హయాంలో చేపట్టారు. ఈ డ్యామ్ పుణ్యమా అని ఆ పరిసర ప్రాంతాల్లో ఉన్న చిన్నచిన్న కొండలను మట్టికోసం ఇష్టమొచ్చినట్లు తవ్వేశారు. రాచపల్లె సమీపాన ఉన్న కదిరేకొండ, ఎనుములగుట్ట, ఎర్రమన్నుకొండ, తుమ్మలమాను కొండ, బొంగుల కొండ, ఎర్రమన్నుగుట్ట, మల్లప్పగారిపల్లె కొండలు, దేవర బాయికొండలు.. ఇలా మొత్తం 11 కొండలను పిండిచేశారు.

కాలేటి వాగు డ్యామ్ నిర్మాణ పనులు పీఎల్ఆర్ కంపెనీ చేపట్టింది. ఈ సంస్థ మట్టిని అక్రమంగా తరలిస్తుంటే నాడు అటవీశాఖ అధికారులు ప్రశ్నించిన పాపానపోలేదు. కె.ఎర్రగుడి, రాచుపల్లె, నక్కలదిన్నె, మల్లప్పగారిపల్లె పరిసరాల్లోని కొండలను తవ్వి తరలిస్తుండగా.. ఆ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అనేకమార్లు నిరసన వ్యక్తం చేసినా వైసీపీ ప్రభుత్వం లెక్కచేయలేదు. కాలేటివాగు ప్రాజెక్టు పనులు చేపట్టిన సంస్థ సాక్షాత్తు అప్పటి అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సంబంధించినది కావడంతో పదుల సంఖ్యలో టిప్పర్లను, ప్రొక్లెయినర్లను ఏర్పాటుచేసి కొండలను తవ్వేశారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న చెరువును సైతం ధ్వంసం చేశారు. ప్రొక్లెయినర్లతో చెరువుకు ఉన్న అలుగును పగులగొట్టి అందులోని నీరు బయటకు పోయేలా చేసి చెరువులోని మట్టిని కాలేటివాగుకు తరలించారు. దీనిని అప్పట్లో ఎవరూ ప్రశ్నించే పరిస్థితి లేదు. అందులోను సాక్షాత్తు అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో చేపట్టిన ప్రాజెక్టు పనులు కావడంతో ఎలాంటి అనుమతులు లేకుండానే మట్టిని తవ్వి తరలించారు. వైసీపీ ధన దాహానికి కొండలు గుల్లయ్యాయి. దీనిపై చంద్రబాబు ప్రభుత్వం విచారణ జరిపి కొండలను మింగిన ఘనులపై చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



ఎనమలగుట్ట

కనుచూపు మేరా బీళ్లే..!

తొలకరి వచ్చిందంటే చాలు భూములను సాగుకు సిద్ధం చేసుకోవడం.. వేరుశనగ విత్తన కాయల కొనుగోలు.. వాటిని విత్తడానికి సిద్ధం చేసుకోవడం వంటి పనులతో గ్రామాలు సందడిగా కనిపించేవి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో మాత్రం దీనికి భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. వరుణుడు ముఖం చాటేయడంతో వేరుశనగ సాగు విస్తీర్ణం భారీగా తగ్గిపోయింది. ఫలితంగా ఎక్కడ చూసినా బీడు భూములే దర్శనమిస్తున్నాయి. అరకొరగా సాగైన వేరుశనగ పైరు కూడా వర్షం కురవకపోవడంతో వాడుముఖం పట్టింది. ప్రతి ఏటా వేరుశనగ సాగు చేస్తున్న రైతులు నష్టాలే చవిచూస్తున్నారు. దీంతో అప్పులు చేసి పంట సాగు చేస్తున్న రైతులకు ప్రతి ఏటా నిరాశే మిగులుతోంది. పదిరోజులుగా అడపాదడపా మేఘాలు ఊరిస్తూ చిరుజల్లులు కురుస్తున్నాయే తప్ప ఓ మోస్తరు వర్షం కూడా పడలేదు.


పర్తికోట సమీపంలో సాగుకు నోచుకోని భూములు

- ముఖం చాటేసిన వరుణుడు...
- ఖరీఫ్ సీజన్‌లో పొలాల్లో కనిపించని పైరు
- భారీగా పడిపోయిన సాగు విస్తీర్ణం
- వాడిపోయిన వేరుశెనగ

ములకలచెరువు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, బి.కొత్తకోట, పెద్దతిప్ప సముద్రం, తంబళ్లపల్లె, కురబలకోట, పెద్దమండ్యం మండలాల్లో ప్రతిఏటా ఖరీఫ్‌లో వర్షాధారంగా వేరుశనగ సాగు చేస్తారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో అప్పుడప్పుడూ వర్షాలు కురిసినా... తీరా విత్తనాలు విత్తే సమయంలో వరుణుడు ముఖం చాటేశాడు. దీంతో సాగుకు సిద్ధమైన రైతన్నలకు నిరాశే మిగిలింది 25 రోజుల క్రితం అరకొరగా కురిసిన వర్షాలకు కొందరు రైతులు వేసిన విత్తనం మొలిచినా, ఆ తర్వాత వర్షం కురవకపోవడంతో మొక్కలు వాడుముఖం పట్టాయి. వారం రోజుల్లోగా వర్షం కురవకపోతే ఆ మొక్కలు కూడా ఎండిపోయే అవకాశం ఉంది.


వర్షం లేక గిడసబారిన వేరుశెనగ పైరు

అంచనాలు ఉల్టా ..

తంబళ్లపల్లె నియోజవర్గంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 13,850 హెక్టార్లలో వేరుశనగ సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖాధికారులు అంచనా వేశారు. అయితే నియోజకవర్గంలో కేవలం 1,475 హెక్టార్లలో మాత్రమే వేరుశనగ సాగైంది. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో గతంలో ఎన్నడూ లేని విధంగా సాగు విస్తీర్ణం భారీగా పడిపోవడానికి కారణమని రైతులు అంటున్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని మండలాల్లో సాగు విస్తీర్ణం వివరాలిలా ఉన్నాయి.

ప్రత్యామ్నాయ పంటలే దిక్కు.

సహజంగా జూన్ 15 నుంచి జూలై మొదటి వారం వరకు వేరుశనగ విత్తనం వేసేందుకు అనువైన కాలం. ఈ సమయంలో వర్షాలు కురవకపోవడంతో వేరుశనగ సాగుకు నోచుకోలేదు. దీంతో దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేసుకున్న రైతులు ప్రత్యామ్నాయంగా కందులు, మొక్కజొన్న, ఉలవ సాగు చేసుకోవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

సాగు విస్తీర్ణం తగ్గడం ఇదే ప్రథమం

వేరుశనగ సాగు విస్తీర్ణం తగ్గిపోవడం 20 ఏళ్లలో ఇదే ప్రథమమని రైతులు చెబుతున్నారు. ప్రతిసారీ విత్తనాలు విత్తే సమయంలో వర్షం పడేదని అంటున్నారు. అప్పట్లో తీరా పంట చేతికొచ్చే సమయంలో వర్షాలు ఎక్కువగా కురవడమో, సాగు సమయంలో వర్షాలు కురవకపోవడం వల్లో నష్టపోయేవాళ్లమంటున్నారు. ఈసారి మాత్రం గతానికి విరుద్ధంగా విత్తనం సమయంలోనే వర్షం కురవకపోవడంతోనే సాగు చేయలేకపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలం	టార్గెట్	సాగయింది
ములకలచెరువు	2924 హెక్టార్లు	510 హెక్టార్లు
కురబలకోట	1800 హెక్టార్లు	400 హెక్టార్లు
తంబళ్లపలె	3200 హెక్టార్లు	350 హెక్టార్లు
పెద్దతిప్పసముద్రం	2300 హెకార్లు	101 హెక్టార్లు
బి.కొత్తకోట	2106 హెక్టార్లు	64 హెక్టార్లు
పెద్దమండ్యం	1520 హెక్టార్లు	50 హెక్టార్లు

మేఘాల వైపు చూస్తున్నా...



25 రోజుల ముందు కురిసిన వర్షానికి రూ.1.50 లక్షలు ఖర్చు చేసి పది ఎకరాల్లో వేరుశనగ విత్తనం వేశాను. అప్పటి నుంచి వర్షం కురవకపోవడంతో మొక్కలు ఎండిపోతున్నాయి. వారం రోజుల్లో వర్షం కురవకపోతే పైరు పూర్తిగా ఎండిపోతుంది. దీంతో వర్షం కోసం మేఘాల వైపు చూస్తు కుర్చున్నా. వరుణ దేవుడు కరుణ చూపకపోతే తీవ్ర నష్టమే.

- రమేశ్, కొట్టంవారిపల్లె

సాగు చేయలేకపోయా...



ప్రతి ఏడాది ఖరీఫ్‌లో ఐదు ఎకరాల వరకు వేరుశనగ సాగు చేసేవాడిని. ఈ సారివర్షం లేక సాగు చేయలేదు. గతంలో ఖరీఫ్‌లో ఈ ప్రాంతంలో ఎక్కడ చూసినా వేరుశనగ పంట కనిపించేది. ప్రస్తుతం బీడు భూములు కనిపిస్తున్నాయి. దేవళచెరువు పంచాయతీలో గతంలో 500 ఎకరాల వరకు వేరుశనగ సాగయ్యేది. ఇప్పుడు 20 ఎకరాలు కూడా సాగు కాలేదు.

- నరసింహారెడ్డి, కన్నెమడుగువారిపల్లె

ప్రత్యామ్నాయ పంటలు ప్రోత్సహిస్తాం



వర్షాలు కురవక రైతులు వేరుశనగ సాగు చేయలేకపోయారు. ప్రస్తుతం విత్తనాలు విత్తే సమయం కూడా ముగియడంతో, ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా చూస్తాం. ప్రస్తుతం కంది, మొక్కజొన్న, ఉలవ సాగు చేసుకోవచ్చు. రైతులు ఆందోళన చెందకుండా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేస్తే మంచిది.

-స్రవంతి, వ్యవసాయశాఖాధికారి

ఆక్రమిత స్థలం పంచాయతీకి స్వాధీనం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


పంచాయతీ అధికారులు స్వాధీనం చేసుకున్న స్థలం, పునాదులు

మదనపల్లె టౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): సీటీఎం-1 గ్రామ పంచాయతీకి చెందిన రూ.30 లక్షల విలువైన స్థలాన్ని స్వాధీనం చేస్తూ రెవెన్యూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారని పంచాయతీ కార్యదర్శి పవన్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ గత నెల ఒకటో తేదీన ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురితమైన 'వివాదాస్పద స్థలంలో బేస్‌మెంట్ నిర్మాణం' కథనంపై స్పందించిన రెవెన్యూ అధికారులు పంచాయతీ కార్యాలయం, జాతీయ రహదారి, రైల్వేలైను పక్కనే వున్న ఈ స్థలంపై ఆరా తీశారు. రెవెన్యూ ఏ-రిజిస్టర్‌లో సర్వే నెంబర్ 978/బి డాటెడ్ ల్యాండ్‌గా నమోదైందన్నారు. ఇందులోని 0.32 ఎకరాల విస్తీర్ణం గల భూమి గ్రామ పంచాయతీకి బదలాయించినట్లు తెలిపారు. ఈ స్థలాన్ని వెంటనే స్వాధీనం చేసుకోవాలని రెవెన్యూ అధికారులు పంచాయతీ కార్యదర్శికి సూచించారు.

విజిలెన్స్, వాణిజ్య పన్నుల శాఖ మెరుపు దాడులు

● దుకాణం సీజ్


హర్షవర్థన్ ఆటో మొబైల్స్‌లో తనిఖీ చేస్తున్న విజిలెన్స్, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు

రైల్వేకోడూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం విజిలెన్స్, వాణిజ్య పన్నుల శాఖ అధికారుల మెరుపు దాడులు చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ డీఎస్పీ శివన్న, డీసీటీవో గీతావాణి మీడియాతో మాట్లాడుతూ రైల్వేకోడూరు పట్టణంలోని రాజ్ కన్వెన్షన్ పక్కనే ఉన్న హర్షవర్ధన్‌రెడ్డి ఆటో ట్రేడర్స్‌కు 2017లో జీఎస్టీ రద్దు అయినా.. అదే పేరుతో సంస్థను నిర్వహిస్తూ పన్ను ఎగవేశారని తెలిపారు. 2022 నుంచి హర్షవర్ధన్ ఆటో మొబైల్స్ అనే పేరుతో ఎలాంటి అనుమతులు, రికార్డులు లేకుండానే సంస్థను కొనసాగించడంతో ప్రభుత్వ ఆదాయానికి లక్షలాది రూపాయల మేరకు గండిపడిందన్నారు. దీంతో దుకాణాన్ని వీఆర్‌వో పీఆర్ ఈశ్వరయ్య సమక్షంలో స్థానిక పోలీసుల సహకారంతో పంచనామా చేసి సీజ్ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ సీఐ నాయకుల నారాయణ, డీసీటీవోలు ఖాజాహుస్సేన్, బాబుమోసెస్, మధుసూదన్‌రెడ్డి, వాణిజ్య పన్నుల శాఖ ఏసీటీవోలు కవిత, నాగేంద్ర, కరీం తదితరులు పాల్గొన్నారు.

లారీ కిందపడి ఉత్తరప్రదేశ్ వాసి మృతి


మోరోసింగ్ మృతదేహం

మదనపల్లె అర్బన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): స్థానిక టమోటా మార్కెట్ యార్డులో లారీ కిందపడి యూపీ వాసి మృతి చెందాడు మదనపల్లె టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఐదేళ్ల క్రితం ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 80 మంది బతుకుదెరువు నిమిత్తం మదనపల్లెకు తరలివచ్చి నీరుగట్టువారిపల్లె టమోటా మార్కెట్‌లో దినసరి కూలీలుగా పని చేస్తున్నారు. వారిలో ఒకడైన కాశిగంజ్ జిల్లా, నంగులా తానాకు చెందిన మోరోసింగ్ (50) గురువారం రాత్రి టమోటా మార్కెట్‌లో పని చేస్తుండగా రివర్స్ తీసుకుంటున్న లారీ వెనక చక్రాల కిందపడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న టూటౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం వివరాలను సేకరించి మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రామచంద్ర తెలిపారు. మార్కెట్ యార్డులోని అతని సహచరులు, తమ ఊరివాళ్లు మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు.


'టీచర్లను బోధనకే పరిమితం చేయాలి'

● ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి వేణుగోపాల్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి వేణుగోపాల్ రెడ్డి

పీలేరు రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులను కేవలం బోధనకే పరిమితం చేయాలని ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి అరవ వేణుగోపాల్ రెడ్డి కోరారు. పట్టణంలో ఎస్టీయూ డివిజన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ చదువుకు సంబంధం లేని యాప్‌లతో టీచర్ల సమయం వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో ఒక చోటి నుంచి మరో ప్రాంతానికి బదిలీపై వెళ్లిన పలువురు ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు చెల్లించకుండా జాప్యం చేయడం సబబు కాదన్నారు. ఉపాధ్యాయులకు అందవలసిన ఆర్థిక ప్రయోజనాలు సకాలంలో ఇవ్వకపోవడం తగదన్నారు. వాస్తవాలను గుర్తించి న్యాయమైన సమస్యలు సత్వరం పరిష్కరించాలని కోరారు. జిల్లాలో ఎస్టీయూను బలోపేతం చేయడం కోసం సత్వరం మండలాల వారీగా సభ్యత్వ నమోదు ప్రారంభించాలని నిర్ణయించారు. డివిజన్ లో మండల కమిటీలతో సమావేశాలు నిర్వహించి నిర్ణీత గడువులోపు మెంబర్‌షిప్ కార్యక్రమం పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో యూనియన్ నేతలు మహేశ్వర్ రెడ్డి, లోకనాథరెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి, డాక్టర్ జనార్ధన్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, బాల వెంకట్రమణ, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ధర్మవరం-నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ వారం రోజులు రద్దు



కలికిరి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ నుంచి విజయవాడ, తిరుపతి, పీలేరు, కలికిరి మీదుగా ధర్మవరం వరకూ నడిచే ఎక్స్‌ప్రెస్ సర్వీసులను వారం రోజులపాటు రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. 17247 నెంబరుతో నర్సాపూర్ నుంచి ధర్మవరం వరకు నడిచే సర్వీసు ఆగస్టు 11 నుంచి 18 వరకు రద్దు కానుంది. 17248 నెంబరుతో ధర్మవరం నుంచి నర్సాపూర్‌కు నడిచే సర్వీసును ఆగస్టు 12 నుంచి 19వ తేదీ వరకు రద్దు చేస్తున్నారు. ఈ సర్వీసుల కోసం ఈ తేదీల్లో ఇది వరకే టికెట్లు రిజర్వు చేసుకున్న వారికి ప్రత్యామ్నాయ మార్గాల వెసులుబాటు కోసం సర్వీసులు రద్దు చేస్తున్నట్లు సందేశాలు కూడా పంపింది. విజయవాడ-గూడూరు స్టేషన్ల మధ్య పెదవడ్లపూడి, దుగ్గిరాల, తెనాలి జంక్షన్, సుందూరు స్టేషన్ల మధ్య డబ్లింగ్ నుంచి ట్రిబ్లింగ్ (మూడు లేన్‌లు), విద్యుదీకరణ, ఇతర పనులు జరుగుతున్న కారణంగా ఈ సర్వీసులను రద్దు చేస్తున్నారు. ఈ మార్గంలో మొత్తం 49 ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్, ప్యాసింజర్ సర్వీసులు కూడా వివిధ తేదీల్లో రద్దవుతున్నాయి.

సైబర్ నేరస్థుడి అరెస్టు

● కడపలో అదుపులోకి తీసుకున్న ఖమ్మం సైబర్ క్రైం పోలీసులు

ఖమ్మంక్రైం, జూలై 24(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ టీచర్‌ను బెదిరించి సుమారు రూ. 26 లక్షలు వసూలు చేసి మోసం చేసిన కేసులో ఒకరిని ఖమ్మం సైబర్ క్రైం పోలీసులు కడప జిల్లాలో అరెస్టు చేసినట్లు ఖమ్మం సీపీ సునీల్ దత్ తెలిపారు. ఖమ్మం అర్బన్ మండలానికి చెందిన రిటైర్డ్ టీచర్‌కు నిందితుడు ఫోన్ చేశాడు. హ్యూమన్ ట్రాఫికింగ్, మనీలాండరింగ్‌కి పాల్పడ్డావని బెదిరించారు. తాము బెంగుళూరు పోలీసులమని, డిజిటల్ అరెస్టు చేస్తామని హెచ్చరించారు. దీంతో భయపడిన సదరు ఉపాధ్యాయుడు ఏప్రిల్ 2025లో పలు దఫాలు గా సుమారు రూ.26లక్షలు వారి ఖాతాకు జమ చేశాడు. ఈక్రమంలో రూ. 20లక్షలు అకౌంట్‌కి వెళ్లిన దామ విజయ్‌కుమార్ అనే యువకుడిని అన్నమయ్య జిల్లా, లక్కిరెడ్డిపల్లి గ్రామంలో అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. నిందితుడిని సైబర్ క్రైం కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారని తెలిపారు.

ప్రజలు సంతృప్తి చెందేలా సేవలందించాలి

● అధికారులకు కలెక్టర్ చామకూరి శ్రీధర్ సూచన


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

రాయచోటి(కలెక్టరేట్), జూలై24(ఆంధ్ర జ్యోతి): ప్రజలందరూ సంతృప్తి చెందేలా అధికారులు, సిబ్బందిసేవలందించాలని, ఇందుకు సంబంధించిన మార్గ దర్శకాలను, బంగారు కుటుంబాలను మ్యాప్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. గురువారం అమరావతిలోని సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ పేదరికం లేని సమాజం పీ4 కార్యక్రమం, ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచిఅభిప్రాయాల సేకరణ తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ చామకూరి శ్రీధర్, సంయుక్త కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పీ4 కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని, మార్గదర్శి బంగారు కుటుంబాలను మ్యాప్ చేసే ప్రక్రియను వేగవంతం చేసి ఆగస్టు 15 కల్లా పూర్తయ్యేలా చూడాలన్నారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి లేకుండా చూడాలని, ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించిన వాటిపై సమీక్షిస్తూ ఇసుక లభ్యత, విద్యుత్ అన్నివేళలా అందించడం, విద్యుత్‌లో ఓల్టేజ్ సమస్యలు లేకపోవడం వంటి అంశాల్లో ప్రజలందరూ సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇచ్చిన సూచనల మేరకు సంబంధిత శాఖల వారు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పీజీఆర్ఎస్ దరఖాస్తులపై సత్వరం స్పందించండి

● సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్


తహసీల్దార్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

బి.కొత్తకోట, జూలై 24(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌యస్) దరఖాస్తులపై సత్వరం స్పందించి పూర్తి ఆధారాలతో సరైన నివేదికను ఇవ్వాలని మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన బి.కొత్తకోట తహసీల్దార్ కార్యాలయంలో రీసర్వే, హౌసింగ్, పీజీఆర్‌యస్ అర్జీలతో పాటు పలు రెవెన్యూ అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి వీఆర్వోను విడివిడిగా పిలిచి ఆయా గ్రామపంచాయతీలోని తాజా పరిస్థితిపై ఆరా తీశారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ నిర్దేశిత అంశాలపై ఎప్పటికప్పుడు నివేదికలతో సిద్ధంగా ఉండాలని, వివిధ సమస్యలపై ప్రజలు పెట్టుకునే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాబాజాన్, డీటీ బాలాజీ, ఆర్ఐ వీరాంజనేయులు పాల్గొన్నారు.

మున్సిపల్ వైస్ ఛైర్మన్‌పై హత్యాయత్నం కేసు

రాయచోటిటౌన్, జూలై24(ఆంధ్రజ్యోతి): రాయచోటి మున్సిపల్ వైస్ ఛైర్మన్ దశరథరామిరెడ్డిపై అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో హత్యాయత్నం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు... రాయచోటి పట్టణ పరిధిలోని మిట్టవాండ్లపల్లె వద్ద గల సర్వే నెంబర్ 553లో రిటైర్డ్ డీఈ మండెం ఆదినారాయణరెడ్డికి 50 సెంట్లు పట్టా భూమి ఉంది. ఆ స్థలంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ దశరథరామిరెడ్డి తన కల్యాణ మండపానికి సిమెంటు రోడ్డు వేశాడు. దీనిపై వారి మధ్య వివాదం నడుస్తోంది. గురువారం ఆదినారాయణరెడ్డి తన భూమిలో సిమెంటు రోడ్డు వేయడాన్ని అడ్డుకున్నాడు. దీంతో దశరథరామిరెడ్డి మారణాయుధాలు కలిగిన సుమారు 20 మందితో కలసి ఆదినారాయణరెడ్డి కుటుంబ సభ్యులను చంపే ప్రయత్నం చేశాడని రాయచోటి పోలీసులకు ఫిర్యాదు అందింది. దీంతో దశరథరామిరెడ్డితో పాటు అతని అనుచరులపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటచలపతి తెలిపారు.

ఆకతాయికి దేహశుద్ధి

గుర్రంకొండ, జూలై 24(ఆంధ్రజ్యోతి): కళాశాలల వద్ద అమ్మాయిలను వేధిస్తున్న ఆకతాయికి ఓ బాలిక తల్లిదండ్రులు దేహశుద్ధి చేశారు. పట్టణంలోని కాలేజీలు, పాఠశాలలు వద్ద విద్యార్థినులకు ఆకతాయిల వేధింపులు ఎక్కువయ్యాయి. దీంతో పాఠశాలలు, కాలేజీలకు వెళ్లాలంటేనే బాలికలు హడలిపోతున్నారు. మధ్యాహ్నం, సాయంకాలం ఆకతాయిలు ద్విచక్ర వాహనాల్లో తిరుగుతూ బాలికలను ఇబ్బంది పెడుతున్నారు. విద్యార్థినులకు బలవంతంగా ఫోన్ నెంబర్లు ఇచ్చి బెదిరిస్తున్నారు. కొందరు విద్యార్థినులు ఆకతాయిల వేధింపులు తల్లిదండ్రులకు చెప్పలేక ఆందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో తనను ప్రేమించాలంటూ ఓ యువకుడు గురువారం మధ్యాహ్నం ఓ విద్యార్థినిని వేధించాడు. ఈ విషయాన్ని ఆమె ఫోన్ ద్వారా తన తండ్రికి తెలియజేసింది. దీంతో కాలేజీ వద్దకు వచ్చిన విద్యార్థిని తండ్రి ఆ యువకుడిని చితకబాదాడు. విషయాన్ని కాలేజీ అధ్యాపకులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఆకతాయి యువకుడిని పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లారు. పట్టణంలో ఆకతాయిల ఆగడాలను అరికట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పాముకాటుతో మహిళకు అస్వస్థత

నిమ్మనపల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): పొలం పనులు చేస్తుండగా పాముకాటు వేయడంతో ఓ మహిళ పరిస్థితి విషమంగా మారింది. గురువారం జరిగిన ఈ సంఘటనపై బాధిత కుటుంబీకుల కథనం మేరకు వెంగంవారిపల్లి పంచాయతీ బాలినాయునిపల్లి గొల్లపల్లివాసి పాలేటి భార్య మంగమ్మ ఎర్రచెరువు వద్ద వ్యవసాయ పనులు చేస్తుండగా కాలికి పాము కాటు వేసింది. దీంతో ఆమె అపస్మారక స్థితికి చేరుకుంది. పరిస్థితి గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను మదనపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

తాళి కట్టు శుభవేళ..!



- నెల రోజులపాటు ఊపిరాడని ముహూర్తాలు
- వివిధ శుభ కార్యాలకు సమాయత్తం
- కల్యాణ మండపాల బుకింగ్ ఫుల్
- నేటి నుంచి శ్రావణ మాసం ప్రారంభం
- నెల రోజుల విరామంతో వరుస ముహూర్తాలు

కలికిరి/బద్వేలు టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మంచి ముహూర్తమనే పేరు ఎత్తకుండానే నెల రోజులపాటు బేజారెత్తించిన ఆషాఢ మాసం ముగిసింది. గురు మూఢం వైదొలగి శ్రావ్యమైన శ్రావణ మాసానికి తలుపులు బార్లా తెరచింది.. అడుగడుగునా శుభ ముహూర్తాలతో ఈ నెల రోజులపాటు ఎడతెరిపి లేకుండా పెళ్లి బాజాలు మోగేందుకు సిద్ధమయ్యాయి. జూలై చివరి వారం నుంచి ఆగస్టు మూడో వారం వరకూ పెళ్ళిళ్లు, గృహ ప్రవేశాలు, శంకుస్థాపనలు వంటి శుభ కార్యాలకు తగిన 15 ముహూర్తాలున్నాయి. ఆషాఢ మాసానికి ముందే నిశ్చితార్థాలు పూర్తయిన వారు ఏర్పాట్లలో తలమునకలయ్యారు. ఇప్పటికైతే కల్యాణ మండపాలన్నీ పూర్తిగా బుక్ అయిపోయాయి. ఆలస్యంగా ముహూర్తాలు పెట్టుకున్న వారు కనీసం చిన్నపాటి పంక్షన్ హాలు కూడా దొరక్క బెంబేలెత్తిపోతున్నారు. వరుణ దేవుడు మన్నిస్తే ఇంటిపట్టునే ఆరుబయట పందిళ్ళేసి మమ అనిపించేందుకు కూడా సిద్ధపడుతున్నారు. శుభ లేఖలు పంపిణీ, ఆభరణాల కొనుగోలు, వంట సామాగ్రి సమీకరణ, బాజా భజంత్రీలు, అలంకరణలు వంటివాటిపై దృష్టి పెట్టారు. మరో వైపు కేటరింగ్ లేదా వంట మాస్టర్ల ముందస్తు నిర్ణయాలు కూడా పూర్తయ్యాయి. ఇప్పుడిప్పుడే ఆడంబరాల కోసం బారాత్‌లాంటి వ్యవహారాలపై రిహార్సల్స్ మొదలు పెట్టేవారూ వున్నారు. శ్రావణ మాసంలో జూలై 26, 30, 31 తేదీల్లో ముహూర్తాలు ప్రారంభమవుతుండగా ఆగస్టులో దాదాపు 12 రోజులు శుభ ముహూర్తాలున్నాయి. అనంతరం 18 నుంచి సెప్టెంబరు 20 వరకూ భాద్రపద మాసంలో పూర్తిగా ముహూర్తాలు ఉండవు. ఆపైన సెప్టెంబరు 24 నుంచి నాలుగు రోజులు, అక్టోబరు నెలాఖరు వరకూ 13 రోజులు, ఆ తరువాత నవంబరులో మరో 13 రోజులు ఆశ్వయుజ, కార్తీక మాసాల్లో ముహూర్తాల సందడికి కొదవుండదు.

శ్రావణ మాసంలో ఆధ్యాత్మిక సందడి

ఒక వైపు శుభ ముహూర్తాలతో తెలుగు లోగిళ్ళు శ్రావణ మాసంలో కళకళలాడనుండగా మరో వైపు ఈ మాసమంతా ఆధ్యాత్మిక సందడి నెలకొననుంది. ప్రధానంగా మహిళలకు.. అందునా నూతన వధువులకు మంగళగౌరీ వ్రతాలతో తీరికుండదు. రుద్రాభిషేకంలాంటి శివారాధనలకు ఈ మాసం విశిష్టమైనదిగా చెపుతారు. జీవ నదుల్లో శ్రావణ మాస స్నానాలు కూడా పవిత్రంగా భావిస్తారు. ఈ మాసంలో చంద్రుడు, శుక్రుడు శక్తివంతంగా ఉంటారని కూడా శాస్త్రాలు చెపుతాయి. ఇక శ్రావణ పౌర్ణమిని రాఖీ పౌర్ణమిగా కూడా భావిస్తారు. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలపై చెప్పాల్సిన పనిలేదు. మొత్తం మీద శుభ ముహూర్తాలు ఒక వైపు ఆధ్యాత్మిక సందడి మరో వైపు.. ఈ నెల రోజులూ హడావుడిగా ఉండనున్నాయి.

ఆగస్టులో 10 రోజుల సెలవులు

శ్రావణ మాసంలో ముహూర్తాల జోరుకు తగ్గట్లు ఆగస్టు నెలలో వరుస సెలవులు కూడా కలిసొస్తున్నాయి. ఆగస్టు 3 ఆదివారం, 8న వరలక్ష్మి వ్రతం, 9, 10 రెండవ శనివారం, ఆదివారాలు, 15న స్వాతంత్ర్య దినోత్సవంతోపాటు వరుసగా మూడు రోజులు అంటే 16 కృష్ణాష్టమి, 17న ఆదివారంతో వరుస సెలవులున్నాయి. ఇక ఆగస్టు 24 ఆదివారం, 27న వినాయక చవితి, మళ్లీ 31 ఆదివారంతో నెలంతా వెసులుబాటు కలుగుతోంది. ఈ నెలలో ఐదు ఆదివారాలు రావడం, మామూలుగా సెప్టెంబరులో వచ్చే వినాయక చవితి కూడా ఆగస్టులోనే రావడం బాగా కలిసొస్తోంది.

ప్రమాణ స్వీకారాలకు ఇదే సమయం

ఇక రాజకీయాల్లో కూడా ఒక రకమైన సందడి ఈ నెలలో కనపడనుంది. ఇటీవలే ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ కమిటీలు, సహకార సంఘాలకు నామినేటెడ్ కమిటీలను నియమించింది. ఇన్నాళ్ళు మంచి ముహూర్తాలు లేక వేచి చూస్తున్న ఆ కమిటీల నాయకులు ఈ నెలలోనే ప్రమాణా స్వీకారాలకు కూడా ముహూర్తాలు పెట్టుకున్నారు.

డిగ్రీ అడ్మిషన్లు ఎప్పుడో..!

- ఇంటర్ ఫలితాలు విడుదలై మూడు నెలలైనా..
- నోటిఫికేషన్ విడుదల చేయని విద్యాశాఖ
- ఎదురు చూస్తున్న విద్యార్థులు, యాజమాన్యాలు



కడప ఆర్ట్స్ కళాశాల (ఫైల్)

కడప ఎడ్యుకేషన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఇంటర్ ఫలితాలు వెల్లడించి మూడు నెలలుపైనే గడుస్తున్నప్పటికీ డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ మొదలు కాకపోవడం గందరగోళానికి దారితీస్తోంది. ప్రవేశాలు ఎప్పుడు కల్పిస్తారంటూ ఇటు విద్యార్థులు, అటు ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ఎదురుచూస్తున్నాయి. ఇప్పటికే ఏపీ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ అడ్మిషన్లతో పాటు పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేసింది. వివరాల్లోకి వెళితే...

ఉమ్మడి కడప జిల్లాలో 71 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వీటిలో ప్రైవేటు 52, ఎయిడెడ్ 5, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు 14 ఉన్నాయి. వీటిల్లో అడ్మిషన్ల కోసం లక్షల మంది విద్యార్థులు ఎదురు చూస్తున్నారు. అడ్మిషన్లు తీసుకోవాలంటే కళాశాలలు గుర్తింపు కోసం దరఖాస్తులు చేసుకోవాలి. అడ్మిషన్ల ప్రక్రియ గందరగోళంలో ఉండడంతో ఈ ఏడాది ఇప్పటి వరకు ఎవరు దరఖాస్తు చేయలేదు. ప్రభుత్వం నుంచి కమిటీ వచ్చి కళాశాలలో మౌలిక సదుపాయాలు ఉన్నాయా లేదా పరిశీలించి గుర్తింపు పునరుద్ధరిస్తారు. ఇప్పటి వరకు ఇలాంటి ప్రక్రియ మొదలు కాలేదు.

గందరగోళానికి ప్రధాన కారణం

డిగ్రీలో సింగిల్ మేజర్ విధానం కొనసాగించాలా... డబుల్ మేజర్ విధానం ప్రవేశపెట్టాలా.. అనే గందరగోళం నెలకొనడమే అడ్మిషన్ల జాప్యానికి కారణం. ఇప్పటి వరకు సింగిల్ మేజర్ విధానం నడుస్తోంది. ఈ ఏడాది నుంచి డబుల్ మేజర్ విధానం ప్రవేశపెడతామని, ప్రతి కళాశాల ఇందుకు అప్‌గ్రేడ్ చేయించుకోవాలని సూచించారు. ఆ మేరకు యాజమాన్యాలు నగదు చెల్లించి అనుమతి తీసుకున్నారు. విద్యార్థులకు డబుల్ మేజర్‌పై అవగాహన కల్పించారు. చాలా మంది తల్లిదండ్రులు దీనివైపు మొగ్గుచూపించారు. కానీ ప్రభుత్వం చివరకు సింగిల్ మేజర్ వైపు మొగ్గు చూపుతూ నిర్ణయం తీసుకుంది. మరోవైపు ఇంతకుముందు ఆఫ్‌లైన్‌లోనే డిగ్రీ ప్రవేశాలకు అడ్మిషన్లు జరిగేవి. వైసీపీ వచ్చాక ఆన్‌లైన్ విధానం ప్రవేశపెట్టింది. ఈ ఏడాది నుంచి ఆన్‌లైన్‌లో ప్రవేశాలు కల్పించే అవకాశం ఉందని కళాశాలల యాజమాన్యాలు చెబుతున్నాయి. దీనిపై కూడా అయోమయం నెలకొంది.

విడుదల కాని బకాయిలు

ప్రభుత్వ కళాశాలలకు రావాల్సిన రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇప్పటికీ విడుదల కాలేదు. దీంతో కళాశాలలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయి. బకాయిలను విడతల వారీగా విడుదల చేస్తామని చెప్పినప్పటికీ ఇప్పటి వరకు విడుదల చేయలేదు. 2023-24కు మూడు క్వార్టర్లు, 2024-25కు మూడు క్వార్టర్లకు బకాయిలు విడుదల చేయాలి. దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదు.

సింగిల్, డబుల్ మేజర్ విధానం అంటే...

డిగ్రీలో సింగిల్ మేజర్ విధానం అంటే విద్యార్థి ఒకే ఒక్క ప్రధాన సబ్జెక్టును మేజర్ తీసుకొని మిగిలిన సబ్జెక్టులను మైనర్‌గా గానీ, సపోర్టివ్‌గా గానీ చదవాలి. ఉదాహరణకు బీఎస్సీ (ఫిజిక్స్) అంటే... ఫిజిక్స్ ప్రధాన మేజర్ సబ్జెక్టు. మిగిలిన సబ్జెక్టులు కెమిస్ట్రీ, మేథ్స్ వంటివి సపోర్టివ్ ఉంటాయి. డబుల్ మేజర్ అంటే డిగ్రీలో రెండు ప్రధాన సబ్జెక్టులను మేజర్ తీసుకొని చదవాలి. ఉదాహరణకు బీఏ (హిస్టరీ, పొలిటికల్ సైన్స్) ఇక్కడ హిస్టరీ, పొలిటికల్ సైన్స్ రెండూ మేజర్ సబ్జెక్టులు. రెండింటిని సమాన ప్రాముఖ్యతతో చదివి, రెండింటిపైనా లోతుగా అవగాహన పెంచుకుంటారు.

ఇతర కోర్సుల వైపు విద్యార్థులు..

ప్రభుత్వ నిర్ణయం ఆలస్యం కారణంగా ఇప్పటికే డిగ్రీలో చేరాలనుకునే వేలాది విద్యార్థులు ఇంజనీరింగ్ ఇతర కోర్సుల వైపు వెళుతున్నారని యాజమాన్యాలు చెబుతున్నాయి. గత ఏడాది అడ్మిషన్లు బాగా పడిపోయాయి. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో మరింత అడ్మిషన్లు తగ్గిపోయే ప్రమాదం ఉంది.

ప్రకృతి వ్యవసాయ సాగును విస్తరింపజేయాలి



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ జేడీ చంద్రానాయక్

కడపరూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ సాగును మరింత విస్తరింప చేయాలని వ్యవసాయశాఖ జేడీ చంద్రానాయక్ పేర్కొన్నారు. కడప నగరంలోని ఏడీఏ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై మూడురోజుల శిక్షణా కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రైతులకు ప్రకృతి వ్యవసాయ ప్రయోజనాలను తెలిజేసి తద్వారా ప్రభుత్వ లక్ష్యసాధనకు పాటుపడాలన్నారు. విచక్షణా రహితంగా వాడుతున్న రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని తగ్గించాలన్నారు. జిల్లా ఉద్యానవనశాఖ అధికారి రవిచంద్ర అరటి, నిమ్మ వంటి ఉద్యాన పంటలను ప్రకృతి వ్యవసాయం ద్వారా ఏ విధంగా పండించవచ్చునో తెలియజేశారు. కడప సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్వీ సురేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జీవామృతం, కషాయాలు ఏవిధంగా తయారు చేయాలో తెలుసుకుని రైతులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ జిల్లా డీపీఎం ప్రవీణ్, కడప వ్యవసాయ డివిజన్ పరిధిలోని ఏవోలు, రైతుసేవా ఇన్‌చార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.

చీని, నిమ్మ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయజ్యోతి

కడప కలెక్టరేట్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చీని, నిమ్మ పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం కనీస మద్దతు ధర కల్పించి ఆదుకోవాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎన్‌డీ విజయజ్యోతి కోరారు. గురువారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గంలో ఎక్కువ మంది రైతులు చీని, నిమ్మ తోటలు సాగుచేస్తారన్నారు. అయితే ఈ ఏడాది ధరలు పూర్తిగా పడిపోవడంతో రైతుల తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వెంటనే మార్కెట్‌యార్డుల్లో నిల్వ ఉన్న వాటిని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులకు ఆర్థిక భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు ధ్రువకుమార్‌రెడ్డి, సయ్యద్ గౌస్‌పీర్, అశోక్‌రెడ్డి, సిరాజుద్దీన్, మాజీ కార్మిక సంఘ రాష్ట్ర చైర్మన్ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విషద్రావణం తాగి వ్యక్తి ఆత్మహత్య



కమలాపురం రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పాపాఘ్ని పాత బ్రిడ్జి కింద సయ్యద్ రసూల్ (52) విషద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల సమాచారం మేరకు... కడపకు చెందిన సయ్యద్ గురువారం ఉదయం కమలాపురంలో ఉంటున్న తన కుమార్తె జైబీన్ ఇంటికి వచ్చాడు. కుమార్తె ఇంటి వద్ద లేకపోవడంతో తిరిగి కడపకు బయలుదేరాడు. 11 గంటల సమయంలో తన కుమార్తెకు ఫోను చేసి తనను దేవుడు రమ్మంటున్నాడని, పాపాఘ్ని నది సమపంలోని బ్రిడ్జి వద్ద విష ద్రావణం తాగానని, మీ అమ్మను జాగ్రత్తగా చూసుకోమని చెప్పి ఫోన్ కట్ చేశాడు. దీంతో అప్రమత్తమైన అతని కుమార్తె కుటుంబసభ్యులతో కలిసి సంఘటనా స్థలం వద్దకు చేరుకున్నారు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతన్ని రిమ్స్‌కు తరలించగా అప్పటికే మృతి చెందాడు. ఈ మేరకు కమలాపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ విద్యాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భూవివాదంలో వైసీపీ నాయకులు అరెస్టు

మైదుకూరు రూరల్, జులై 24 (ఆంధ్రజ్యోతి): భూవివాదమై మన్యం రాణి అనే మహిళపై కొడవలితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన కేసులో కొందరు వైసీపీ నాయకులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని గడ్డమాయపల్లె గ్రామంలో నివశిస్తున్న మన్యం రాణి వారి దాయాదుల మధ్య భూ వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం ఆమె ఇంటిలో ఉండగా... మన్యం రమేష్‌రెడ్డి, మన్యం రజిత, మన్యం సిద్దారెడ్డి, మన్యం పెద్ద సిద్దారెడ్డి, మన్యం రామ్మోహన్‌రెడ్డి కొడవలితో దాడికి పాల్పడ్డారు. దీంతో ఆమెకు తీవ్రగాయాలు కావడంతో ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి నిందితులను కోర్టుకు హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

బాలిక కిడ్నాప్ కేసులో యువకుడి..

కడప క్రైం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కడప నగరం అల్మాస్‌పేటకు చెందిన బాలికను కిడ్నాప్ చేసిన కేసుకు సంబంధించి యువకుడిని అరెస్టు చేసినట్లు కడప టూటౌన్ ఎస్ఐ హుసేన్ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు ప్రొద్దుటూరు పట్టణం ఆంధ్రకేసరి వీధికి చెందిన మునిశ్రావణ్‌కుమార్ ఇంటర్ వరకు చదివి ఖాళీగా ఉంటున్నాడు. ఈనెల 16న అల్మాస్‌పేటకు చెందిన బాలికను బలవంతంగా ద్విచక్ర వాహనంలో తీసుకెళ్లాడు. బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు కిడ్నాప్ కేసు నమోదు చేసి గురువారం అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

కడుపు నొప్పి తాళలేక వ్యక్తి మృతి

పోరుమామిళ్ల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్లలోని శీనప్ప బావివీధికి చెందిన చెన్నంశెట్టి సుబ్బరాయుడు (34) కడుపు నొప్పి తాళలేక అధిక మోతాదులో మందులు వేసుకోవడంతో తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. పోరుమామిళ్లలో చెన్నంశెట్టి సుబ్బరాయుడు మెడికల్ స్టోరు నిర్వహించేవాడు. ఈనెల 22న కడుపు నొప్పిరావడంతో మందులు తీసుకున్నాడు. నొప్పి ఎక్కువ కావడంతో మరికొన్ని మాత్రలు వేసుకోవడంతో అస్వస్తతకు గురయ్యాడు. అతన్ని కుటుంబ సభ్యులు పోరుమామిళ్లలోని ప్రైవేటు ఆసుపత్రికి... మెరుగైన వైద్యం కోసం కడపకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పాల లారీ ఢీకొని గేదెలు మృతి



కొండాపురం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) మండలంలోని ఓబన్నపేట గ్రామం వద్ద గురు వారం సాయింత్రం పాలలారీ ఢీకొనడంతో రెండు గేదెలు మృతి చెందాయి. ఇదే గ్రామా నికి చెందిన పెద్దగురప్ప అనే రైతు గేదెలను మేపుకొని రోడ్డు దాటుతుండగా తాడిపత్రి వైపు వెళుతున్న పాల లారీ గేదెలను ఢీకొంది. దీంతో రెండు గేదెలు అక్కడికక్కడే మృతిచెందగా, మరో గేదెకు గాయాలైనట్లు రైతు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని, తనను ఆదుకోవాలని రైతు కోరారు.

31 మద్యం బాటిళ్లు స్వాధీనం

పోరుమామిళ్ల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా మద్యం బాటిళ్లు తీసుకెళుతున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. గురువారం సీతారామాపురం క్రాస్‌రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పెద్దకప్పలనపల్లెకు చెందిన కప్పల శ్రీనివాసులు అక్రమంగా 31 మద్యం బాటిళ్లు తీసుకువెళుతుండగా స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆటో ఢీకొని వ్యక్తికి గాయాలు

బద్వేలుటౌన్, జులై 24 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు రోడ్డులోని స్థానిక పాల్‌టెక్నిక్ కళాశాల సమీపంలో గురువారం ఆటోను ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో శ్రీనివాసులు అనే వ్యక్తికి గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 వాహనం ద్వారా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురాయి అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట వేయండి

- ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎమ్మెల్సీ ఫిర్యాదు


సీఎం చంద్రబాబుకు అక్రమ మైనింగ్ అరికట్టాలంటూ వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

పులివెందుల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గంలోని వేముల, వేంపల్లె మండలాల్లో అక్రమ ముగ్గురాయి (బెరైటీస్) మైనింగ్‌కు అడ్డుకట్ట వేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. గురువారం అమరావతిలో ముఖ్యమంత్రిని కలిసి ఎమ్మెల్సీ వినతిపత్రం సమర్పించారు. కడప జిల్లాలోని వేముల, వేంపల్లె మండలాల్లో అపారమైన ముగ్గురాయి ఉందన్నారు. బ్రిటీష్‌కాలం నాటి నుంచి ఇక్కడ కొందరికి మైనింగ్‌కు అనుమతులు ఉండేవన్నారు. అన్నిటికి కాలపరిమితి ముగిసిందన్నారు. వేల ఎకరాల విస్తీర్ణంలో ఈ ముగ్గురాయిని కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా వెలికితీసి అక్రమంగా కోట్లు గడిస్తున్నారన్నారు. ఈ ముగ్గురాయి వెలికితీసే సమయంలో ఎలాంటి రక్షణ లేకుండానే వెళ్లి మైనింగ్ సాగిస్తున్నారన్నారు. దీంతో అనేక ప్రమాదాలు కూడా చోటుచేసుకున్నాయని తెలిపారు. వేముల మండలం గొంది పల్లెలో 275 సర్వే నెంబర్‌లో 705.43 ఎకరాలలో కృష్ణప్ప బెరైటీస్ కంపెనీకి గతంలో అనుమతులు ఉండేవన్నారు. ప్రస్తుతం ఎలాంటి లీజు లేదు, రెన్యువల్ కూడా కాలేదన్నారు. ఈ కంపెనీ దాదాపు రూ.6కోట్లు ప్రభుత్వానికి బకాయిలు ఉందన్నారు. ఇదే సర్వేనెంబర్‌లో కొందరు అక్రమ మైనింగ్ సాగిస్తున్నారన్నారు. రోజు వంద టన్నుల ఖనిజాన్ని వెలికితీసి టన్ను రూ.30 వేల నుంచి రూ.35వేలతో విక్రయిస్తున్నారన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా రవాణా కూడా సాగిస్తున్నారన్నారు. సంబంధించిన భూయజమాని అక్రమంగా చేస్తున్నారని అధికారులకు మొరపెట్టుకున్నా ఎవరూ స్పందించడం లేదన్నారు. అలాగే వేంపల్లె మండలం కత్తులూరు వద్ద అక్రమ మైనింగ్ జరుగుతోందన్నారు. ఈ అక్రమ మైనింగ్‌లో రామచంద్ర అనే వ్యక్తి మృతిచెందాడన్నారు. మృతుని కుటుంబానికి రూ.12లక్షలు ఇచ్చి కేసు రాజీ చేసుకున్నారన్నారు. పులివెందుల నియోజకవర్గంలో విచ్చలవిడిగా బెరైటీస్ తవ్వకాలు చేస్తున్నారన్నారు. వేముల మండలం వేముల గ్రామ పరిధిలో టిఫెన్ కంపెనీకి లీజు ఉండేదన్నారు. ఆ సంస్థ రూ.10కోట్ల విలువైన ఖనిజాన్ని వెలికితీసి అక్కడే నిల్వ ఉంచిందన్నారు. రాత్రికి రాత్రే దీనిని అక్రమంగా తరలించి అమ్ముకున్నారన్నారు. అక్రమ మైనింగ్‌పై కఠినంగా వ్యవహరించాలని గతంలో మీరే హెచ్చరించారని ఆయన పేర్కొన్నారు.

వీరమల్లు సినిమా ఫ్యాన్స్‌షోలో ఘర్షణ

కడప క్రైం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ నటించిన హరహర వీరమల్లు చలనచిత్రం ప్రీమియం షో 23న రాత్రి విడుదలైంది. ఈ సందర్భంగా రాత్రి నగరంలోని పాతబస్టాండు సమీపంలో ఉన్న థియేటరు వద్ద పవన్ అభిమానుల మధ్య తొలుత వాగ్వాదం చోటుచేసుకుంది. చివరికి ఘర్షణకు దారితీసింది. అక్కడే ఉన్న పోలీసులు వారిని అడ్డుకున్నారు. అయితే ఇరువర్గాల మధ్య మాటామాటా పెరగడంతో పోలీసులు చొరవ తీసుకుని వారిని అక్కడ నుండి పంపించారు. అయితే ఈ ఘటనపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ విషయంపై కడప వన్‌టౌన్ పోలీసులను వివరణ కోరగా, సినిమా ప్రీమియం రిలీజ్ సందర్భంగా తోపులాట జరిగిందని, అయితే ఎవరు కూడా తమకు లిఖితపూర్వక ఫిర్యాదు చేయకపోవడంతో కేసులు నమోదు చేయలేదని తెలిపారు.

పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రిలో మరోసారి వైద్యపరీక్షలు

పులివెందుల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తొండూరు మండలంలో జరిగిన హత్యాయత్నం కేసులో ఉన్న ఐదుగురికి పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రిలో మరోసారి (గురువారం) వైద్యపరీక్షలు నిర్వహించారు. ఇనగలూరు గ్రామంలో కత్తులతో దాడి చేసిన ఘటనపై జూలై 21వ తేదీ 11మందిపై హత్యాయత్నం కేసు నమోదైంది. ఈ కేసులో ఐదుగురిని జమ్మలమడుగు సివిల్ జడ్జికోర్టులో బుధవారం హాజరు పరచగా ఎస్ఐ విచక్షణారహితంగా కొట్టారని జడ్జికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మరోసారి వైద్యపరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. దీంతో గురువారం ప్రశాంత్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, విష్ణువర్దన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, గంగిరెడ్డిలకు వైద్యపరీక్షలు నిర్వహించారు.

27న సీనియర్స్ అండర్-23 మహిళల క్రికెట్ ఎంపికలు

కడపస్పోర్ట్స్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో ఈనెల 27వ తేదీ ఆదివారం ఉదయం సీనియర్స్‌తో పాటు అండర్-23 మహిళల క్రికెట్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ తెలిపారు. 2002 సెప్టెంబర్ 1 తర్వాత జన్మించిన వారు అర్హులని... ఆసక్తి గల క్రీడాకారులు క్రికెట్ ఎంపికలకు హాజరు కావాలని కోరారు. హాజరయ్యే క్రీడాకారిణీలు ఆధార్‌కార్డు కాపీ, బర్త్ సర్టిఫికెట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, ఒరిజినల్‌తో పాటు ఒక సెట్టు జిరాక్స్, కిట్ బ్యాగ్‌లు వెంట తీసుకురావాలన్నారు.

సీపీఐ జిల్లా కార్యదర్శిగా గాలిచంద్ర



బద్వేలు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బద్వేలు పట్టణంలో కడప జిల్లా 22వ మహాసభలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శిగా గాలిచంద్రను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే జిల్లా కార్యవర్గ సభ్యులుగా జి.రామయ్య, ఎల్.నాగసుబ్బారెడ్డి, బి.చంద్రశేఖర్, ఎస్.వెంకటశివ, పి.సుబ్బరాయుడు, సుబ్రహ్మణ్యం,వి.వీరశేఖర్, సుబ్బారెడ్డి, వేణుగోపాల్, విజయలక్ష్మి, శ్రీరాములు, కేసీ బాదుల్లా, సురేష్, పి.బాలు, మద్దిలేటి, శంకర్‌నాయక్, వెంకటరాముడుతో పాటు 79 మంది జిల్లా కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర మాట్లాడుతూ జిల్లాలో ఉక్కుఫ్యాక్టరీతో పాటు పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న గాలేరు- నగరి, తెలుగుగంగ, రాజోలి 2వ దశ పనులుపూర్తి చేయాలని, సోమశిల, గండికోట, గాలేరు-నగరి ప్రాజెక్టు పరిధిలోని నిర్వాసితులకు వెంటనే పరిహారం, పునరావాసం కల్పించాలని, కడప -బెంగుళూరు రైల్వే పనులు పూర్తి చేయాలని, మూతపడ్డ చెన్నూరు ఫ్యాక్టరీ, ప్రొద్దుటూరు పాలకేంద్రం తెరిపించాలని మహాసభలో తీర్మానించినట్లు ఆయన తెలిపారు.

'వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణానికి అనుమతి కోరలేదు'

బ్రహ్మంగారిమఠం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వీరబ్రహ్మేంద్రస్వామి మాస కల్యాణోత్సవం జరిపేందుకు ఆగస్టు 6న నిర్వహించేందుకు తన అనుమతి కోరలేదని పూర్వ మఠాధిపతి వీరభోగవసంత వేంకటేశ్వరస్వామి ధర్మపత్ని మారుతీ మహాలక్ష్మమ్మ ప్రకటనలో తెలిపారు. మఠం ఫిట్‌పర్సన్ శంకరబాలాజీ స్వామివారి కల్యాణం గురించి తమ అనుమతి కోరలేదన్నారు. కుటుంబ సభ్యులందరూ నిర్ణయం తీసుకున్నారనేది అబద్ధమని తెలిపారు. తనకు పంపిన లెటరులో మఠం అర్చకుల ఆధ్వర్యంలో నిర్ణయం తీసుకున్నారని ఉందని.. కానీ మీడియాకు జూలై 9న ఇచ్చిన పత్రికా ప్రకటనలో అర్చకుల ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులందరూ నిర్ణయం తీసుకున్నట్లు తేడాగా ఉందన్నారు. స్వామివారి కల్యాణ మహోత్సవానికి తన అనుమతి అసలు కోరలేదని, తనకు లెటరు పంపేనాటికి హైకోర్టులో స్టేటస్‌కో ఇచ్చి ఉన్నట్లు మహాలక్ష్మమ్మ తెలిపారు.

2003 డీఎస్సీ వారికి పాతపింఛన్ అమలు చేయాలి


మంత్రులకు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేసి 2003 డీఎస్సీ వారికి పాతపింఛన్ అమలు చేయాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, సీపీఎస్‌ఈఏ రాష్ట్ర అదనపు ప్రధానకార్యదర్శి వెంకట జనార్దన్‌రెడ్డి కోరారు. గురువారం సచివాలయంలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తమ ఉద్యోగులకు అమలు చేసిన విధంగా సీపీఎస్‌ను రాష్ట్ర ప్రభుత్వం కూడా అమలు చేస్తూ.. అదే కేంద్ర ప్రభుత్వం 2004కు పూర్వం రాతపరీక్ష రాసిన వారికి పాత పింఛన్ అమలు చేస్తూ జారీ చేసిన మెమో 57ను ఇప్పటి వరకు రాష్ట్రప్రభుత్వం అమలు చేయకపోవడం శోచనీయమని తెలిపారు. కేవలం 11000 మంది మాత్రమే ఈ మెమో ద్వారా లబ్ధిపొందుతారని వారికి వెంటనే పాతపింఛన్ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో 2003 డీఎస్సీ ఫోరం రాష్ట్ర కార్యదర్శి రవీంద్రారెడ్డి, జిల్లా కన్వీనర్లు కురుకుటి సుధాకర్, రిజ్వాన్ అలీ, ప్రొద్దుటూరు నియోజకవర్గం బాధ్యులు అచ్చుకట్ల చాంద్‌బాషా, అనంతపురం జిల్లా కన్వీనర్ గజ్జల ప్రభాకర్, ప్రకాశం జిల్లా కన్వీనర్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎద్దుల కొండపై విశేష పూజలు

వేంపల్లె, జూలై 24 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం సందర్భంగా నేటి నుంచి ఎద్దులకొండపై ఐదు శనివారాలు విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయ పూజారి హరిప్రవీణ్ ఆధ్వర్యంలో విశేష అలంకారాలు, 3వ శనివారం కొండపై కల్యాణం జరుగుతుందని, భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

'కడప ఉక్కుపై గళం విప్పాలి'

కడప సెవెన్‌రోడ్స్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో రాష్ట్రంలోని ఎంపీలు కడప ఉక్కుపై గళం విప్పాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్‌లు తెలిపారు. గురువారం కడప ఆర్‌కే నగర్‌లోని కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కడప ఉక్కుపైన కేంద్రం నిర్లక్ష్యం వహిస్తున్నదన్నారు. సంవత్సరాలు గడుస్తున్నా ఇచ్చిన హామీ ఇంత వరకు అమలు కాలేదన్నారు. రాష్ట్ర ఎంపీలు కడప ఉక్కుపైన గళం విప్పి నిధులు రాబట్టాలని కోరారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు రెబ్బ నరసింహులు, నగర కార్యదర్శి విజయ్, జిల్లా కమిటీ సభ్యులు విశ్వనాథ్, జిల్లా నాయకులు సునీల్ పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరిదేవి జయంతి వేడుకలు



వల్లూరులో కలశాలతో నీళ్లు తెస్తున్న మహిళలు, చెన్నూరులో ప్రత్యేక అలంకారంలో చౌడేశ్వరిదేవి, కడపలో కలశాలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

కడప కల్చరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎర్రముక్కపల్లెలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారి జయంతి పురస్కరించుకుని గురువారం ఆలయ కమిటీ అధ్యక్షుడు కళ్యాసుధాకర్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. తెల్లవారుజామునే ఆ తల్లికి ఆలయంలో పంచామృతాభిషేకం, ప్రత్యేక పుష్పాలంకరణ గావించారు. అనంతరం ఉదయం 108 మంది ముత్తైదువలతో సమీప కొత్త శివాలయం నుంచి కలశాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి అభిషేకం గావించారు. అనంతరం మధ్యాహ్నం ఆలయం వద్ద భక్తులకు పెద్దఎత్తున అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

చెన్నూరు: చెన్నూరులో కొలువైన రామలింగ చౌడేశ్వరిదేవి జయంత్యుత్సవం గురువారం కన్నులపండువగా జరిగింది. తెల్లవారుజామునే సుప్రభాత సేవతో అమ్మవారిని మేల్కొలిపి తదనంతరం అభిషేకాలు, అర్చనలు, పూజలు ప్రత్యేక అలంకారాలు గావించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

వల్లూరు: మండల పరిధిలోని దుగ్గాయపల్లెలో కొలువై ఉన్న చౌడేశ్వరిదేవి జయంతిని స్థానిక ప్రజలు వైభవంగా నిర్వహించారు. గురువారం ఉదయాన్నే అమ్మవారికి విశేషంగా పంచామృతాభిషేకం చేశారు. గ్రామ ప్రజలు, ముఖ్యంగా మహిళలు కలశాలను తీసుకుని వచ్చారు. అనంతరం అమ్మవారికి ప్రీతికరమైన బోనాలు సమర్పించి కాయకర్పూరం చెల్లించారు.

సీకేదిన్నె: చౌడేశ్వరీదేవి జయంతి వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని రోడ్డు క్రిష్టాపురంలో అమ్మవారికి 108 బిందెలతో అభిషేకం నిర్వహించి పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారిని పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. మండలంలోని చింతకొమ్మదిన్నె, పాపాసాహెబ్‌పేట, ప్రొఫెసర్స్ కాలనీ, తదితర ఆలయాల్లో చౌడేశ్వరీదేవి జయంతిని నిర్వహించారు.

పెండ్లిమర్రి: మండల పరిధిలోని ఎగువపల్లెలో గురువారం ఘనంగా చౌడేశ్వరిదేవి వార్షికోత్సవం జరిగింది. ఉదయం అమ్మవారికి అభిషేకం, అలంకారం, కుంకుమార్చన నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. మహిళలు పెద్దఎత్తున అమ్మవారి పూజల్లో పాల్గొన్నారు.

వేంపల్లె: వేంపల్లె పిరమిడ్ నగర్‌లోని చౌడేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారి జయంతి వేడుకలు గురువారం వేడుకగా జరిగాయి. అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన తదితర విశేష పూజలు చేశారు. పెద్దఎత్తున మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దుతాం

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాధవి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే

కడప ఎర్రముక్కపల్లె, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సమస్యలు లేని నగరంగా కడపను తీర్చిదిద్దుతామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాధవి తెలిపారు. గురువారం కడప నగరం ద్వారకానగర్ తమ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగర ప్రజలు అధిక సంఖ్యలో హాజరై వారి సమస్యలను తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కడప నగరాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి డివిజన్‌లో సమస్యలను పరిష్కరించి అభివృద్ధి చేస్తామని తెలిపారు. అనంతరం కడప నియోజకవర్గంలో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.22,56,978 విలువైన 30 చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి రక్తగ్రూపు తెలుసుకోవాలి

● జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు



కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్‌వో

కడప(వినాయక నగర్), జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి రక్త గ్రూపు తెలుసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి, రెడ్‌క్రాస్ సొసైటీ స్పెషల్ ఆఫీసర్ విశ్వేశ్వర నాయుడు పేర్కొన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కడప జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం కడప నగరం ఐటీఐ సర్కిల్‌లోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బ్లడ్ గ్రూపు తెలుసుకోవాలని, ఏదైనా అనుకోని ప్రమాదాలు సంభవించినప్పుడు ఇది చాలా ఉపయోగపడుతుందన్నారు. అంతేకాకుండా జిల్లా వ్యాప్తంగా రెడ్‌క్రాస్ సొసైటీ తరపున అనేక కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. అనంతరం నగరంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో జరిగిన రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదాతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ యశస్వి, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ సుధాకర్, ప్రధానోపాధ్యాయురాలు గాయత్రిబాయి, ల్యాబ్ టెక్నీషియన్ స్వరూపారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధునిక కవుల్లో జాషువా తర్వాతే ఎవరైనా

● జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు మూల

కడప కల్చరల్, జూలై 24. (ఆంధ్రజ్యోతి): ఆధునిక కవులలో ప్రముఖ కవి గుర్రం జాషువా తర్వాతే ఎవరైనా అని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. గుర్రం జాషువా 54వ వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో వర్ధంతి వేడుకలు నిర్వహించారు. తొలుత జాషువా చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో రంగస్థల నటులు ప్రకాశ్, దేవరశెట్టి గంగయ్య, కాటిసీనులో జాషువా రాసిన పద్యాలు ఆలపించి రంజింపచేశారు. హార్మోనిస్టు రామలింగయ్య, కళాకారులు బాలగంగయ్య, గండికోట రెడ్డయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

కమలాపురంరూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభదాయకమని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఏడీఏ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై వ్యవసాయశాఖ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. కమలాపురం వ్యవసాయ డివిజను పరిధిలో కమలాపురం, వల్లూరు మండలాలకు సంబంధించిన రైతుసేవా కేంద్రం సిబ్బందికి సహాయ వ్యవసాయ సంచాలకుడు నరసింహారెడ్డి, డీపీఎం, ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో మూడురోజుల శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా మొదటిరోజు ఈవీసీ విజయకుమార్ ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకతను తెలిపారు. కార్యక్రమంలో డీపీఎం ఎస్పీ ప్రవీణ్‌కుమార్, ఏడీపీఎం వై.వసంతకుమారి, మండల వ్యవసాయాధికారులు సరస్వతి, కిరణ్‌కుమార్‌రెడ్డి, శ్యాంబాబు, అశోక్‌రెడ్డి, వ్యవసాయాధికారి సుచిత్ర, సిబ్బంది వెంకటరామరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అకౌంట్‌కు పీఎఫ్ జమచేయాలి

● ఉపాధ్యాయ సంఘాల వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న లెక్కల జమాల్‌రెడ్డి, వెంకటనాథ్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ఉపాధ్యాయులకు 2022 జనవరి నెల ప్రీమియం ఇంత వరకు జమ చేయలేదని, వెంటనే జమ చేయాలని పీఎస్‌టీయు వైఎస్ఆర్టీఏ నాయకులు లెక్కల జమాల్‌రెడ్డి, సజ్జల రమణారెడ్డి, వెంకటనాథ్‌రెడ్డి, రమేష్, అమర్‌నాథరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం జడ్పీ కార్యాలయంలో జిల్లా పరిషత్ ఛైర్మన్ రామగోవిందరెడ్డి వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందిస్తూ ప్రావిడెంట్ ఫండ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ నాగిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి పిలిపించి వెంటనే 2022 జనవరి పీఎఫ్ ప్రీమియంవెంటనే అకౌంట్‌కు జమచేయాలని ఆదేశించారు. నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రతి డీడీఓ తమ పరిధిలోని ఉద్యోగుల ఉపాధ్యాయుల 2022 జనవరి స్లిప్పులను వ్యక్తిగతంగా కాకుండా తమ పరిధిలో ప్రస్తుతం పనిచేసే ఆఫీస్ నుంచి ఉద్యోగ ఉపాధ్యాయుల అందరి స్లిప్పులనుఒక కవరింగ్ లెటర్ ద్వారా అందజేస్తే వెంటనే జమచేస్తామని తెలిపారు.

ఎన్‌ఆర్‌ఐల జాబితా తయారు చేయండి

● ఆర్డీవో జాన్ ఇర్విన్

చెన్నూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ఉన్న ఎన్ఆర్ఐల జాబితా తయారు చేయాలని, పీ4 సర్వేలో వీరి ద్వారా పేదలు బాగుపడేలా చేద్దామని కడప ఆర్డీవో జాన్ ఇర్విన్ అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయానికి గురువారం సాయంత్రం వచ్చిన ఆయన రెవెన్యూ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మండలంలో బాగా చదువుకుని ఇతర దేశాల్లో స్థిరపడి ఆర్థికంగా ఉన్న వ్యక్తుల జాబితా వీలైనంత త్వరగా తయారు చేస్తే వారితో మాట్లాడి నిరుపేదలను దత్తత తీసుకుని వారికి సహాయ సహకారాలు అందించేలా చేస్తామన్నారు. ఇందుకోసం ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం జాబితా తయారు చేయాలని సూచించారు. అలాగే ఇప్పటివరకు రీసర్వే ఎంతవరకు జరిగింది, ఆగష్టు 15 నాటికి రీసర్వే బౌండరీలు ఫిక్స్ చేయాలని ఆయన సూచించారు. ప్రతి రైతు రీసర్వేకు సహకరించేలా చూడాలని, ఇందుకోసం ఆయా రెవెన్యూ గ్రామాల్లో ఉన్న వీఆర్వోలు, వీఆర్ఏలు రైతులతో మాట్లాడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు సరస్వతి, డీటీ వెంకటరమణ, ఆర్ఐలు నాగసుబ్బారెడ్డి, కౌశిక్, సర్వేయరు ఖాజాహుసేన్, వీఆర్వోలు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి : శశిభూషణ్‌రెడ్డి



మాట్లాడుతున్న శశిభూషణ్‌రెడ్డి

కమలాపురంరూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టరు శశిభూషణ్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక రామాలయంలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జిల్లాలో బీజేపీ బలపడాలంటే ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేసినప్పుడే అది సాధ్యమవుతుందన్నారు. ఈ నెల 27న బీజేపీ రాష్ట్ర అధ్యక్షునిగా నూతనంగా నియామకమైన పీవీఎన్ మాధవ్ జిల్లాలో పర్యటించనున్నారని ప్రతి మండలం నుంచి కార్యకర్తలు వచ్చి పర్యటన విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వెంకటేశ్వరుని తొలి గడప దేవునికడప నుంచి శోభాయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా నాయకుడు బీరం శ్రీధర్‌రెడ్డి, సురేశ్‌కుమార్‌రెడ్డి, మహిళా కార్యదర్శి ప్రశాంతి, విజయభాస్కర్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు తక్షణమే ఆపండి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల భారాన్ని తక్షణమే ఆపకపోతే పెద్దఎత్తున ప్రజా ఉద్యమాన్ని నిర్వహిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.ప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం సీపీఎం జిల్లా కార్యాలయంలో విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడుతూ విద్యుత్‌చార్జీలు పెంచడం లేదంటూనే వినియోగదారుల జేబులకు కత్తెర వేసే టైం ఆఫ్ డే టార్ఫ్ విధానాన్ని చిరు వ్యాపారులకు సైతం అమలు చేస్తామని ప్రకటించడం దారుణమని తీవ్రంగా విమర్శించారు. సోలార్ విద్యుత్ యూనిట్ రూ.1.99కి టెండర్లు పడిన రోజుల్లో సెకీతో రూ.2.49కి కొంటామని ఒప్పందం చేసుకోవడం సరైంది కాదన్నారు. రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు అమర్చే కాంట్రాక్ట్‌ను అదానికి కట్టబెట్టారని విమర్శించారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, కార్యదర్శివర్గ సభ్యులు రామ్మోహన్, మనోహర్, అన్వేష్, శివకుమార్, జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరిరెడిడ, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజల సహకారం అవసరం : ఎక్సైజ్ సీఐ

పులివెందుల రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాలు పెనుభూతంలా మారాయని వీటిని ఎక్కడికక్కడ అరికట్టాలంటే ప్రజల సహకారం అవసరమని ఎక్సైజ్ సీఐ చెన్నారెడ్డి, డాక్టర్ శరణ్యలు విజ్ఞప్తి చేశారు. గురువారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ శ్రీనివాసులు అధ్యక్షతన మత్తు పదార్థాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవన శైలిలో ఎన్నో మార్పులు చేరువయ్యాయని, అందులో మంచికంటే చెడు ప్రభావం ఎక్కువ అవుతోందన్నారు. అనంతరం మాదక ద్రవ్యాల నివారణ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపల్ గణేష్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ నాగేంద్రమ్మ, అనిత, ఈగల్ క్లబ్ కోఆర్డినేటర్‌లు అనిత, షీల, అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

దళితులకు న్యాయం చేయాలి : డీజీహెచ్‌పీఎస్

కడప సెవెన్‌రోడ్స్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పాతకడప దళితుల భూమి సమస్యను పరిష్కరించి, వారికి న్యాయం చేయాలని, దళిత గిరిజన హక్కుల పోరాట సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకటేశ్, మడగలం ప్రసాద్ కోరారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో, స్థానిక ఎమ్మెల్యే నివాసంలోని గ్రీవెన్స్‌లో, డీజీహెచ్‌పీఎస్ నాయకులు, బాధితులతో కలిసి వినతిపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓబులేసు, దివాకర్, వీరసుబ్బయ్య, వెంకటసుబ్బయ్య, చిన్న సుబ్బయ్య, పెద్ద ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

స.హ. చట్టంపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సూర్యప్రకాశ్

కడప ఎన్జీఆర్ సర్కిల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సహకార శాఖలోని అధికార యంత్రాంగానికి గురువారం సమాచార హక్కుచట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక సహకారశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో జిల్లా సహకారశాఖ అధికారి కార్యాలయంలోని పబ్లిక్ ఇన్‌ఫర్మేషన్ ఆఫీసరు సూర్యప్రకాశ్‌రావు మాట్లాడుతూ 2005లో సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చిందన్నారు. ప్రతిఒక్కరూ ఈ చట్టాన్ని కోరేందుకు అర్హులని తెలిపారు. ఈ కార్యక్రమంలో కడప డీసీవో ఆఫీసు జూనియర్ అసిస్టెంట్ అంజనాదేవి, డీసీఏవో కార్యాలయ అసిస్టెంట్ రిజిస్ట్రారు పవన్‌కుమార్, సీనియర్ ఇన్‌స్పెక్టరు సదాశివరాజు, డివిజనల్ సహకార కార్యాలయంలోని అసిస్టెంటు రిజిస్ట్రార్ జాన్ సుశీల, రమాదేవి, రామక్రిష్ణ, షణ్ముఖకుమార్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతపరచాలి

● ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి సూచన



సాగు అంశాలను వివరిస్తున్న ఏడీఏ

పులివెందుల రూరల్, జూలై 24 (ఆంధ్ర జ్యోతి): ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తృతపరచాలని పులివెందుల ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. గురువారం స్థానిక కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై రైతుసేవా కేంద్రం సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వలన కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించి చైతన్యం తేవాలన్నారు. రసాయన ఎరువుల వలన కలిగే దుష్ప్రరిణామాలను వివరిస్తూ, మానవాళి మనుగడకు ప్రకృతి వ్యవసాయం ముఖ్యమన్న విషయాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి రాఘవేంద్రరెడ్డి, ఏఓలు చెన్నారెడ్డి, ఓబులేసు, సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

అప్పులు తప్ప అభివృద్ధి ఊసే లేదు

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 14 నెలల కూటమి పాలనలో అప్పులు తప్ప అభివృద్ధి ఊసేలేదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గంగలో కలిపారని మండిపడ్డారు. గురువారం వైసీపీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల హామీలు మరిచారని, ప్రభుత్వ ఉద్యోగులకు అందాల్సిన అరియర్స్ సైతం ఇవ్వలేదని చెప్పారు. స్త్రీనిధి పథకం అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మాలన్న మంత్రి అచ్చన్నాయుడు వ్యాఖ్యలు దారుణమన్నారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు బీహెచ్ ఇలియాస్, పులి సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

కడప సెవెన్‌రోడ్స్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరమని వన్‌స్టాప్ సెంటర్ సిబ్బంది పేర్కొన్నారు. నగరంలోని ఓ ప్రైవేటు స్కూలులో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సురక్షిత స్పర్శ, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, ఓఎస్‌సీ, 100, 1098, 181, 112 హెల్ప్ లైన్ నెంబర్ల గురించి అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జ్యోతి, లాయర్ ఉమ, కౌన్సిలర్ సునీత, ప్రిన్సిపల్, కరస్పాండెంట్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మండల సమావేశం వాయిదా

పోరుమామిళ్ల, జూలై 24 (ఆంధ్రజ్యోతి) :మండల సర్వసభ్యసమావేశం వాయిదా పడినట్లు ఎంపీడీవో ఉపేంద్ర రెడ్డి తెలిపారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల వల్ల ఈ సమావేశం వాయిదా పడిందని తిరిగి తదుపరి సమావేశం తేదీని తెలుపుతామన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు జరగాలి

బద్వేలు రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) :మండల పరిధిలోని గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రులలోనే కాన్పులు చేయించుకోవడం సురక్షితమని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి వెంగయ్య తెలిపారు. తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గుండంరాజుపల్లె లో గురువారం లింగ నిర్ధారణ చట్టంపై గర్భిణులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయ మహిళా పోలీసు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసరు, ఏఎన్‌ఎంలు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణుల వివరాలు ఆన్‌లైన్ చేయాలి

పోరుమామిళ్ల, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : గర్భిణుల వివరాలను ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయాలని జిల్లా ఉప ఆరోగ్య అధికారి డాక్టర్ మల్లేశ్ పేర్కొన్నారు. గురువారం పోరుమామిళ్ల మండలంలోని టేకూరుపేటలో ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీల సమీక్ష సమావేశంలో వర్షాకాలంలో అంటువ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మెడికల్ ఆఫీసరు డాక్టర్ మేరీ ఎల్సా, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సాదు వెంకటేశ్వర్లు, ఆరోగ్య విస్తరణాధికారి రఘురాములు పాల్గొన్నారు.

మొక్కలు నాటాలి

మైదుకూరు రూరల్, జులై 24(ఆంధ్రజ్యోతి) : మొక్కలు నాటి పర్యావరణం కాపాడుదామని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గజ్జల వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. లెక్కలవారిపల్లె జిల్లా పరిషత్ పాఠశాలలో హెచ్‌ఎం నరసింహులు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

వైభవంగా చౌడేశ్వరి దేవి జయంతి



ప్రొద్దుటూరులో చౌడేశ్వరీ అమ్మవారు



మైలవరం: కలశాలతో చౌడేశ్వరిదేవి ఆలయానికి ఊరేగింపుగా వస్తున్న మహిళలు



ఎర్రగుంట్లలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ప్రొద్దుటూరు టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): చౌడేశ్వరీదేవి జయంతి వేడుకలను పట్టణంలోని చౌడేశ్వరీదేవి ఆలయాల్లో గురువారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి జయంతిని పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచి భక్తులు అమ్మవారి దర్శనానికి పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. భక్తుల రాకతో చౌడేశ్వరీదేవి ఆలయాల్లో కిటకిటలాడాయి. సుబ్బిరెడ్డి కొట్టాలులోని చౌడేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి సుందరంగా అలంకరించారు. వసంతపేటలోని చౌడేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. థర్మల్‌రోడ్డులోని అష్టభుజ మహాచౌడేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారిని శోభాయమానంగా అలంకరించారు. వినాయకనగర్‌లోని చౌడేశ్వరీదేవి ఆలయం, ఆర్ట్స్ కాలేజీ రోడ్డులోని చౌడేశ్వరీదేవి ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వినియోగం చేశారు.

ఎర్రగుంట్లలో: చౌడేశ్వరీదేవి జన్మదిన వేడుకలు మండల వ్యాప్తంగా గురువారం వైభవంగా నిర్వహించారు. స్థానిక ముద్దనూరురోడ్డులోని చౌడేశ్వరీదేవి ఆలయంలో ఉదయం నుంచి అభిషేకం, కుంకుమార్చన, అష్టోత్తరశతనామ పూజలు నిర్వహించారు. భారీగా తరలివచ్చిన భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. నిడుజువ్వి గ్రామంలో చౌడేశ్వరీదేవి అమ్మవారి ఆషాఢ మాసం అమావాస్య సందర్భంగా సారే చీరే సమర్పించారు. చిన్నారులు వేసిన కోలాటం అందరిని ఆకట్టుకుంది. ఆర్టీపీపీలోని చౌడేశ్వ రీదేవి ఆలయంలో భక్తులు అమ్మ వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

మైలవరంలో: తొగటవీర క్షత్రియుల ఆరాధ్యదైవమైన చౌడేశ్వరీదేవి జయంతి వేడుకలను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల పరిధిలోని దొమ్మరనంద్యాల, వేపరాల, మైలవరం గ్రామాల్లోని చౌడేశ్వరీదేవి అమ్మవారికి మహిళలు కలశాలను మోస్తూ పురవీధుల్లో భక్తి పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ ఆలయం వద్దకు చేర్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక అలంకరణ చేసి అమ్మవారి మూలవిరాట్‌ను శోభాయమానంగా అలంకరించారు. వేలాది మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. అమ్మవారి జయంతిని పురష్కరించుకుని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి వేపరాలలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

ముద్దనూరులో:మండలంలోని ఉప్పలూరు, చిన్నదుద్యాల గ్రామాల్లో గురువారం చౌడేశ్వరీ దేవి ఆలయాల వద్ద అమ్మవారి పుట్టినరోజు వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. అలాగే బర్త్‌డే కేక్ కట్ చేసి భక్తులు అమ్మవారికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కొండాపురంలో: మండలంలోని టి.కోడూరు గ్రామంలో వెలసిన చౌడేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారి జయంతి ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని రథంలో మేళతాళాల మధ్య గ్రామంలో పురవీధుల గుండా ఊరేగించారు. ఇందులో భాగంగా నిర్వహించిన జ్యోతుల ఉత్సవం భక్తులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు.

విద్యుత్ స్తంభాల మార్పిడిపై విచారణ

ప్రొద్దుటూరు జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్పీడీసీఎల్ ప్రొద్దుటూరు డివిజన్ పరిధిలోని ఎర్రగుంట్ల సబ్‌డివిజన్‌లోని పందిళ్లపల్లెలో అనుమతి లేకుండా విద్యుత్ స్తంభాల మార్పిడి చేయడంపై వచ్చిన అభియోగాలమేరకు ఆ శాఖ విచారణవిభాగం ఎస్ఈ కృష్ణారెడ్డి, సీజీఎం వరప్రసాద్‌లు విచారణ చేపట్టారు. గురువారం స్థానిక డివిజన్ కార్యాలయంలో ఫిర్యాదులకు సంబంధించి పలురకాల ఫైల్స్‌ను పరిశీలించారు. కమలాపురం నియోజకవర్గం పందిళ్లపల్లెలో బదలాయింపు ఫీజులు చెల్లించకుండానే విద్యుత్ స్తంభాలను అప్పటి ఏడీఈ నరసింహారెడ్డి పోల్ షిఫ్టింగ్ పనులు చేపట్టడం విచారించి ఇందులో విద్యుత్ శాఖకు ఆర్థిక నష్టం కలిగిందా అనే కోణంలో కూడా పరిశీలించారు. ఈ వ్యవహారంలో అప్పటి విద్యుత్ సిబ్బందిని ఫిర్యాదు దారులను పిలిపించి వివరాలను అడిగి నమోదు చేసుకున్నారు. ఫిర్యాదుదారుల ఇచ్చిన ఆరోపణల అంశాలపై ఏడీఈ నరసింహారెడ్డి నుంచి వివరణ తీసుకున్నారు. అప్పటి డివిజన్ కార్యాలయం ఈఈ శ్రీనివాసులరెడ్డి నుంచి సంజాయిషీ నమోదు చేసుకున్నారు.

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే జైలుపాలే

ఖాజీపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే జైలుపాలై వారి ఉజ్వల భవిష్యత్తును కోల్పోతారని యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ సీఐ ఈదురుబాష అన్నారు. గురువారం మోడల్ స్కూల్ విద్యార్థులకు ప్రత్యేకఅవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిల్లలపై జరుగు నేరాలపై ప్రత్యేక నియంత్రణపై, ఈవ్‌టీజింగ్, సైబర్‌నేరాలు, సామాజిక మాధ్యమాలు వాడకంపై శక్తియాప్ ఉపయోగాలపై ఫ్రీ హెల్ప్‌లైన్ అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీరాంనగర్‌లో చౌడేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు



శ్రీరాంనగర్‌లో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి):శ్రీరాంనగర్‌లోని జగజ్జనని చౌడేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారి జన్మదిన వేడుకలను వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాద వినియోగం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని కాయాకర్పూరం సమర్పించి భక్తిశ్రద్ధలతో మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మోతుకూరు వెంకటసుబ్బయ్య, బొలిశెట్టి మల్లికార్జున, కుండా నాగరాజు, పల్లా ఈశ్వరయ్య, బొలిశెట్టి శ్రీరాములు, సానా వెంకటసుబ్బయ్య, ఉమ్మడి సుబ్బన్న, బొలిశెట్టి గురప్ప పాల్గొన్నారు.

మిద్దెవారిపాలెంలో చౌడేశ్వరి అమ్మవారి జయంతి



చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బద్వేలు రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : చౌడేశ్వరీదేవి అమ్మవారు జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక మిద్దెవారిపాలెంలో ఉన్న చౌడేశ్వరిదేవి ఆలయంలో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాడమాసం గురువారంనాడు చౌడేశ్వరిదేవి అమ్మవారి జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతిఏటా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని మిద్దెవారిపాలెం ప్రజలు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మిద్దెవారిపాలెం, కోటవీధి తదితర ప్రాంతాల ప్రజలు భారీగా పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుంకులాంబ అమ్మవారికి పూజలు

జమ్మలమడుగు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సలివెందుల గ్రామంలో గురువారం సుంకులాంబ అమ్మవారి జయంతిని పురష్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి సుంకులాంబ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి మొక్కుకున్నారు. ఆలయ కమిటీవారు ఆయనను ఘనంగా సత్కరించారు. సుంకులాంబ అమ్మవారు పుట్టిన రోజు పురష్కరించుకుని భూపేశ్‌రెడ్డి కేక్ కట్ చేశారు. అలాగే మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, మార్కెట్‌యార్డు ఛైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి పూజలు చేసి మొక్కుకున్నారు. భూపేశ్‌రెడ్డి, నాగులకట్ట చౌడేశ్వరీదేవాలయంలో, కన్నెలూరు, మోరగుడి గ్రామాల్లోని చౌడేశ్వరీ దేవాలయాలను సందర్శించి పూజలు నిర్వహించారు.

పేదరిక నిర్మూలనే పీ-4 లక్ష్యం

బద్వేలుటౌన్, జులై 24 (ఆంధ్రజ్యోతి) : పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పీ-4 కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినట్లు మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని శివానగర్, పూసలవాడ కాలనీల్లో వార్డు సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీ-4 కార్యక్రమం ద్వారా పేదలను సంపన్నులుగా చేయడమే ఈ కార్యక్రమ ఉద్దేశ్యమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి

బి.కోడూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) :దోమల పట్ల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి నరసింహారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలం పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో డెంగ్యూ మాసోత్సవంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు. . అనంతరం కీటక జనిత వ్యాధులపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పుష్పాంజలి, సీహెచ్ఓ విద్యార్థులు పాల్గొన్నారు.

681 మంది విద్యార్థులకు దుస్తులు వితరణ

కాశినాయన జూలై24(ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్లకు చెందిన చిత్తా శౌరిరెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్స్ ఇన్ నీడ్ సంస్థ సహకారంతో 681 మంది విద్యార్థులకు ఉచితంగా దుస్తులు అందజేసినట్లు ఆసంస్థ ప్రతినిధులు ప్రసాద్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డిలు తెలిపారు. గురువారం వంకమర్రి, ఇటుకులపాడు, కోడిగుడ్లపాడు, నర్సాపురం తదితర పాఠశాలల విద్యార్థులకు దుస్తులు అందించారు. ఈకార్యక్రంలో ఆయా పాఠశాలల ప్రదానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

14 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

చాపాడు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం ఖాదర్‌బాద్‌కు చెందిన బోయకిశోర్, కుమార్ అనే వ్యక్తుల నుంచి 14 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చిన్నపెద్దయ్య చెప్పారు. ఎస్ఐ గురువారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఏపీ04సీఏ9939 అనే నంబరుగల కారులో అక్రమంగా దుంగలను చెన్నైకి తరలిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, రూరల్ సీఐ శివశంకర్ ఇచ్చిన సమాచారం వాటిని పట్టుకున్నట్లు చెప్పారు.

పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం ఏర్పాటు

పోరుమామిళ్ల, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గాన్ని ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో అధ్యక్షులుగా పోరుమామిళ్ల కార్యదర్శి ఓబులేసు, రంగసముద్రం కార్యదర్శి ప్రసాద్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. కోశాధికారిగా రవీంద్రరెడ్డి, ఉపాధ్యక్షులుగా సరిత, వెంకటసురేంద్ర, కార్యదర్శులుగా హరికృష్ణ, సంజీవరెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. డిజిటల్ అసిస్టెంట్ల సంక్షేమానికి అవసరమైన చర్యలు చేపడతామన్నారు.

మైదుకూరు అభివృద్ధికి నిధులు కేటాయించండి

● సీఎం చంద్రబాబును కలిసి విన్నవించిన ఎమ్మెల్యే పుట్టా



సీఎం చంద్రబాబుకు సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే పుట్టా

మైదుకూరు రూరల్, జులై 24(ఆంధ్రజ్యోతి): మైదుకూరు నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని నిధులను కేటాయింపు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కోరారు. విజయవాడలోని సచివాలయంలో గురువారం సీఎంను ఎమ్మెల్యే పుట్టా కలిశారు. ఈ సందర్భంగా శ్రీపోతులూరు వీరబ్రంహ్మేంద్ర స్వామి మఠం అభివృద్ధి నిమిత్తం రూ.45 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వ ప్రసాద పథకం నుంచి మంజూరుకు కేంద్రానికి సిఫార్సు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన సీఎం వెంటనే కేంద్రానికి సిఫార్సు చేయడానికి ప్రిపేర్ చేయాలని అధికారులను ఆదేశించినట్లు పుట్టా తెలిపారు. అంతేకాకుండా సాగునీటి ప్రాజెక్ట్‌ల కోసం నిధులను మంజూరు చేయాలని కోరారు. మైదుకూరు సీఎం పర్యటనలో భాగంగా ఇచ్చిన హామీల కు సంబంధించిన నిధులను వెంటనే విడుదల చేయాలని పుట్టా కోరారు. యస్ఆర్1 నుంచి మైదుకూరు మున్సిపాలిటీకి సురక్షిత మంచినీటి పథకం కోసం ఖర్చు చేయనున్న 120 కోట్ల నిధుల మంజూరుకు ఫైల్ క్లియరెన్స్ వచ్చినట్లు పుట్టా తెలిపారు.

గొల్లపల్లెలో తాగునీటి సమస్య పరిష్కారం

మైదుకూరు రూరల్, జులై 24(ఆంధ్రజ్యోతి) :మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని గొల్లపల్లెలో తాగునీటి సమస్య పరిష్కారమైంది. గొల్లపల్లెలో తాగునీటి బోరు రిపేరు రావడంతో గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన మున్సిపల్ అధికారులు 24 గంటల్లోనే సమస్యను పరిష్కరించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో తుపాకుల రమణ,భూమిరెడ్డి ప్రసాద్‌లు దగ్గరుండి మోటరు బిగించేలా పనులు చేయించి నీటి సమస్య తీర్చడంతో గ్రామస్థులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధిలో అవకతవకలు జరిగితే చర్యలు తప్పవు



ప్రజావేదిక లో మాట్లాడుతున్న డ్వామా ప్రాజెక్టు డైరెక్టరు ఆదిశేషారెడ్డి

రాజుపాలెం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నామని, ఇందులో ఏవైనా అవకతవకలు జరిగితే చర్యలు తప్పవని డ్వామా ప్రాజెక్టు డైరెక్టరు ఆదిశేషారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో 19వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సమావేశంలో డ్వామా ప్రాజెక్టు డైరెక్టరు మాట్లాడుతూ సామాజిక తనిఖీల్లో 2024-25 మార్చి నెలాఖరు వరకు ఉపాధి హామీ పథకం ద్వారా జరిగిన పనులను సోషల్ ఆడిట్ సిబ్బంది ద్వారా వివరాలు సేకరించి ఇందులో లోటుపాట్లను గుర్తించామన్నారు. రాజుపాలెం మండలానికి సంబంధించి ఈ పథకం ద్వారా రూ.9.35 కోట్లతో పనులు చేపట్టామని అందులో ఉపాధి హామీ కూలీలకు రూ.4కోట్లు, మిగతా రూ.5.35 కోట్లు మెటీరియల్ రూపంలో ఉంటుందన్నారు. గ్రామాల వారీగా లోటుపాట్లను గుర్తించి ఏమైనా ఉంటే రికవరీ చేయడం, అంతకు మించి ఉంటే చర్యలు తీసుకోవడం జరుగు తుందన్నారు. కార్యక్రమంలో ఉప ఎంపీపీ నారాయణరెడ్డి, అడిషనల్ పీడీ రామలింగేశ్వర్‌రెడ్డి, జిల్లా విజిలెన్స్ ఆఫీసరు జుబేదా, విజయభాస్కర్, డీఆర్‌డీఏ ఏపీడీ వెంకటేశ్వర ప్రసాద్, ఎస్‌పీఎం కోనయ్య, పంచాయతీరాజ్ డీఈ లక్ష్మీనారాయణరెడ్డి, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందించడమే పభుత్వ లక్ష్యం



సుపరిపాలనలో తొలి అడుగులో డీసీసీ బ్యాంకు ఛైర్మన్ సూర్యనారాయణరెడ్డి

అట్లూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని డీసీసీ బ్యాం కు ఛైర్మన్ మంచూరి సూర్యనారాయ ణరెడ్డి తెలిపారు. అట్లూరు మండలం లోని అట్లూరు క్రాస్ రోడ్డు ఉప్పు టూరు కాలనీలో గురువారం సుపరి పాలనలో తొలి అడుగు ఇంటింటి కార్యక్రమం నిర్వహించి సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్ర మంలో మండల టీడీపీ నాయకులు అరవ శ్రీనివాసులరెడ్డి, మండల ఇన్‌ఛార్జ్ పోతిరెడ్డి రెడ్డయ్య, సొసైటీ డైరెక్టరు పాటూరు రాధాక్రిష్ణారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, వరికుంట సర్పంచ్ రమణయ్య, అట్లూరు మాజీ సర్పంచ్ నరసింహులు, టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉలవపల్లెలో సుపరిపాలనలో తొలి అడుగు

పెద్దముడియం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఉలవపల్లె గ్రామంలో టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయీ బ్రాహ్మణ కడప పార్లమెంటు అధ్యక్షుడు గజ్జల గోవిందు తదిత రులు పాల్గొని ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధికార ప్రతినిధి సిద్ధార్థ రాయల్, కార్యనిర్వాహక కార్యదర్శి రామాంజనేయరెడ్డి, జమ్మలమడుగు అధ్యక్షులు మహేశ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఎరువులు అందిస్తాం

ఖాజీపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రైతులకు సకాలంలో ఎరువులు అందిస్తామని అగ్రహారం సొసైటీ ఛైర్మన్ హరినాథరెడ్డి అన్నారు. గురువారం డీసీసీ బ్యాంకు ఛైర్మన్ సూర్యనారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తూ సొసైటీ తరుపున ఎరువులు తెప్పించి రైతులకు అందిస్తానన్నారు. సొసైటీలో తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, కేసీకెనాల్ డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్ రవీంద్రారెడ్డి, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధర్, వాకమల్ల వెంకటరామిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.